
స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర మిషన్‌లో

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ర్యాంకు ఎంత..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర మిషన్‌లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు మూడో ర్యాంకు వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ విషయాన్ని రాజధానిలో శుక్రవారం స్వయంగా ప్రకటించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర కోసం ప్రత్యేక కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాకు మూడో ర్యాంకు లభించడంతో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ మిషన్‌లో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్‌శాఖ 14 ఇండికేటర్స్‌తో పెట్టుకున్న లక్ష్యాలను అధికారులు సీఎం చంద్రబాబుకు అందజేశారు. అందులో పట్టణాభివృద్ధిశాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్‌కు 15

ర్యాంకు : 3 | పాయింట్లు 125/200

'తూర్పు'లో భేష్!

జిల్లా కలెక్టర్ ప్రశాంతి కృషికి ఫలితం

పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్‌కు 35 పాయింట్లు, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్‌కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు ఇచ్చారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్లకు 10, కమ్యూనిటీ సోక్‌పిట్స్‌కు 10 పాయింట్లు, 100 శాతం డోర్‌టు డోర్ చెత్త సేకరణకు 10, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజీకి 20 పాట్లు వంతున మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లా ప్రోగ్రెస్‌పై ర్యాంకులు ఇచ్చారు. అందులో 125 పాయింట్లతో జిల్లాకు 3వ ర్యాంకు లభించింది. జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి జిల్లాకు మూడో ర్యాంకు లభించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని 299 గ్రామాల్లో ప్రతీరోజూ పారిశుధ్యం, నీటి సరఫరా తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ఫోటోలు తీసి పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. జిల్లాలో 299 గ్రామాలకుగాను 268 చోట్ల సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పనులు జరుగుతున్నాయని, కొన్ని షెడ్లకు సమస్య ఉన్నా, వాటి పరిష్కారానికి దృష్టి పెట్టామని చెప్పారు.

ర్యాంకు : 14 | పాయింట్లు 109/200

కాకినాడకు నిరాశ!

కాకినాడ /కాకినాడ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల ర్యాంకింగ్‌లో కాకినాడ వెనుకబడింది. పరిశుభ్రతా ప్రమాణాలు పాటించడంలో మంచిపని తీరు కనబరచలేక 14వ ర్యాంకులో నిలిచింది. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధిశాఖలు కలిపి వివిధ అంశాలపై మొత్తం 14 విభాగాల్లో రేటింగ్ ఇవ్వగా 200 పాయింట్లకుగాను 109 పాయింట్లు మాత్రమే సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా పరిధిలో గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత పెంచేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తోంది. ఇదిలా ఉండగా ఈనెల 3వ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోర్స్ రీసోర్స్ అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. ఇందులో భాగంగా మన మూలాలు- మన బలాలు తెలుసుకుని రాష్ట్రంలోని వనరులను ఏ విధంగా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీనికింద జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటక రంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, నెట్ జీరోకు పర్యావరణాన్ని తీసుకురావడం, సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగులు వేయడం వంటి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.

ర్యాంకు : 17 | పాయింట్లు 105/200

కోనసీమ వెనకడుగు

అమలాపురం(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 17వ స్థానంలో నిలిచి ర్యాంకుల సాధనలో వెనకబడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల్లో కోనసీమ జిల్లా మొత్తం 200 పాయింట్లకుగాను 105 పాయింట్లతో సరిపెట్టుకుంది. జిల్లాలకు 14 ఇండికేటర్స్‌ను పెట్టుకుని వాటిలో అంశాల సాధనలో ముందంజలో ఉన్న జిల్లాలవారీగా ఈ ర్యాంకులు ప్రకటించారు. ముఖ్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్‌శాఖలు చేపట్టిన కార్యక్రమాలపై సీఎం చంద్రబాబునాయుడు ఈ మేరకు సమీక్షించారు. ప్రతీ నెల 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతీ నెల ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనవరి నెలలో న్యూఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకోగా, ఫిబ్రవరిలో సోర్స్ రిసోర్స్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. జిల్లా వెనుకబడిపోవడం చర్చనీయాంశంగా మారింది.

ర్యాంకు : 25 | పాయింట్లు 81/200

అల్లూరి జిల్లాలో అధ్వానం!

రంపచోడవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా ప్రకటించిన ర్యాంకుల్లో చిట్టచివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నిలవడంతో జిల్లా ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. జిల్లా ప్రగతిపై సంబంధిత అధికారులు సరైన దృష్టి పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ జిల్లా మొత్తం 200 పాయింట్లకుగాను 81 పాయింట్లతో చివరి 25 స్థానం పొందింది. రాష్ట్రంలో మొదటి స్థానాన్ని 200 పాయింట్లకుగాను 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా నిలిచింది.

'ఇసుక' రోడ్లు!

- ప్రాణాలు పోతున్నా పట్టదు
- పరిమితికి మించి అధికంగా ఇసుక లోడ్లు
- వే బ్రిడ్జిలు లేవు.. అడిగేవారూ లేరు
- కేసులు రాస్తే.. నేత కన్నెర్ర
- అధికారుల కాసుల కక్కుర్తికి జనం బలి



ఇది తారు రోడ్డే : ధవళేశ్వరం క్యాయర్ బోర్డు వద్ద ఇలా..

ఈనెల 9న చినకొండేపూడికి చెందిన దంతే ప్రసాద్ (26) రాజమహేంద్రవరం రూరల్‌లోని ఓ వివాహానికి హాజరై తిరిగి వెళుతున్న సమయంలో సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద రోడ్డుపై ఇసుక వల్ల బండి జారిపోయింది. కిందపడిన ప్రసాద్ తలపై నుంచి అటుగా వెళ్తున్న లారీ ఎక్కేసింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు ఇసుకలో కలిసిపోయాయి. తర్వాత బొమ్మూరులోని రోడ్డుపై ఇసుక వల్ల ఓ సచివాలయ ఉద్యోగి బండి స్కిడ్ కావడంతో దెబ్బలు తగిలాయి.

ఏ రోడ్డులో వెళ్లినా ఇసుకే. రోడ్డు పక్కనా ఇసుకే. జనం జారి పడుతున్నా.. ప్రాణాలు పోతున్నా.. యంత్రాగం, ప్రజాప్రతినిధుల కళ్లకు మసకే. ఇసుక విచ్చలవిడి తరలింపు మానవత్వాన్ని కూడా ఇసుకలో కలిపేస్తోంది. కూటమి వచ్చిన తర్వాత అద్దంలా మెరుస్తున్న రోడ్లపై ఇసుక చిమ్ముతున్నా.. పట్టించుకునే వారు లేరు.. అడిగేవారు కానరారు. ఒకవేళ అధికారులు కేసు రాస్తే మాత్రం రాజకీయ బాసులకు కళ్లల్లో ఇసుక పడినంత మంట పుడుతోంది. జనం బాధ మాత్రం పట్టడం లేదనే విమర్శలు పెద్దఎత్తున వినవస్తున్నాయి.



కొవ్వూరులో..



అసలు పరదా లేకుండా..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

భోజనం తర్వాత భుక్తాయాసం పడితే గొంతు వరకూ తినకపోతేనేమి అని అంటుంటారు. ఇప్పుడు ఇసుక లారీల పరిస్థితి కూడా అంతకుమించి కనబడుతోంది. నిబంధనలు పట్టించుకోం.. అడిగేవాడూ లేడు అనే పరిస్థితి జనం ప్రాణాల మీదకు తెస్తోంది. గత ప్రభుత్వంలో ఇసుక కోసం జనం నానాతంటాలూ పడాల్సి వచ్చింది. ఇష్టానుసారం ధరలతో బెంబేలెత్తించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక లభ్యతను సీఎం చంద్రబాబు ఆదేశాలతో సులభతరం చేశారు. దీంతో సామాన్యుడికి ఇసుక అందుబాటులోకి వచ్చింది. అయితే ఇసుకాసురుల పాలిట మాత్రం వరంగా పరిణమించింది. అడ్డూఅదుపూ లేకుండా వేల టన్నుల ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో లారీలో ఇంకొక్క గుప్పెడు కూడా పట్టనంతగా ఇసుకను నింపుతున్నారు. ఆ లారీలు ఎక్కువ ట్రిప్పులు వేయాలనే ఆత్రుతలో వేగంగా వెళుతున్నాయి. లారీల్లోని ఇసుక సన్నగా జారుతూ రోడ్డుపై పడుతోంది. ద్విచక్ర వాహనదారులు ఏ మాత్రం ఇసుమంత అదుపుతప్పినా పెద్ద ప్రమాదానికి కారణమవుతోంది. అయినా సరే సంబంధిత శాఖలేమీ పట్టించుకోవడం లేదు.

జరిమానాలకు గంతలు

వాస్తవానికి 6 టైర్ల లారీలో 10 టన్నులకు మించి వేయకూడదు. కానీ 14 టన్నుల వరకూ నింపుతున్నారు. 10 టైర్ల లారీలో 18కి 22 టన్నులు, 14టైర్ల లారీకి 24కి 30 టన్నుల వరకూ, 16టైర్ల లారీలకు 25 టన్నులకు అదనంగా మరో పది టన్నుల ఇసుక లోడు వేస్తున్నారు. ఒకరకంగా డ్రైవరు క్యాబిన్‌లో తప్ప లారీ నిండా ఇసుకే ఉంటోంది. చట్ట ప్రకారం ఆయా లారీల్లో పరిమితికి మించి లోడు వేయకూడదు. అధికంగా ఉన్న లోడుకు టన్నుకు రూ.2 వేల చొప్పున, అదనంగా రూ.20వేలు.. అంటే 5 టన్నులు అధికంగా ఉంటే రూ.30 వేలు జరిమానా విధించవచ్చు. ఈ లెక్కన జరిమానాలు విధించకపోవడంతో లక్షల రూపాయల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. గోదావరి ఇసుక నాణ్యత ఎక్కువగా ఉండడంతో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ఇక్కడి నుంచి హైదరాబాద్ కూడా వెళుతోంది. దూర ప్రాంతాలకు మార్కెట్ లారీల్లో ఇసుక వెళుతోంది. వాటికీ 10 టన్నుల వరకూ అదనంగా లోడు వేస్తున్నారు.

రాజకీయ కన్నెర్ర

జిల్లాలోని కడియం, ధవళేశ్వరం (గాయత్రి), కోటిలింగాలు, కాతేరు, వెంకటనగరం, ముగ్గళ్ల, కాటవరం, కొవ్వూరు, తాళ్లపూడి, ఔరంగాబాద్, వాడపల్లి, అరికిరేవుల తదితర చోట్ల ఇసుక రేవులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని రోడ్లను చూస్తే మరీ దారుణంగా ఇసుకతో నిండిపోయి ఉంటున్నాయి. కొన్ని ప్రదేశాల్లో రోడ్డు పక్కన ఇసుక గుట్టలు కూడా పెడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్లు కోరలు చాస్తున్నాయి. పట్టణాలు, నగరంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. మరోవైపు ఇసుక రాపిడి వల్ల కొత్తగా వేస్తున్న రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. ఒకవైపు కూటమి ప్రభుత్వం రోడ్లను అద్దాల్లా తయారుచేస్తుంటే.. ఇసుక లారీలు వాటిని చిందరవందర చేస్తున్నాయి. అయితే ఒకవేళ అధికారులు చర్యలకు ఉపక్రమిస్తే ఇసుక వ్యాపారంలో ఉన్న, ఆ వ్యాపారులకు దన్నుగా ఉన్న రాజకీయ నాయకులు కన్నెర్ర చేస్తూ.. ఇసుక సులభతరం చేసినా స్థానిక అధికారుల వల్ల ఇబ్బందులు వస్తున్నాయంటూ సీఎం చంద్రబాబు దృష్టికి తప్పుగా సమాచారం తీసుకెళ్తున్నారని తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో జరిగినట్టు వినవస్తోంది. దీంతో జనాలు ఇబ్బంది పడుతున్నా.. ప్రాణాలు పోతున్నా అధికారులు మాత్రం కళ్లు మూసుకోక తప్పడం లేదు.

చాలీచాలని వస్త్రం

నిబంధనల ప్రకారం ఇసుక ర్యాంపుల్లో వేయింగ్ బ్రిడ్జిలను లైసెన్సుదారులు ఏర్పాటుచేసుకోవాలి. లారీలో ఇసుక లోడు చేసిన తర్వాత లారీని వేయింగ్ బ్రిడ్జిపైకి తీసుకెళ్లాలి. ఒకవేళ లోడు అధికంగా ఉంటే తొలగిస్తారు. అప్పుడు ర్యాంపులోంచి లారీ బయటకు రావాలి. కానీ ర్యాంపుల్లోంచి వందల లారీలు అధిక లోడుతో వెళుతున్నా వేయింగ్ బ్రిడ్జిలను మాత్రం ఏర్పాటు చేయడం లేదు. ఒకవేళ అరకొరా ఉన్నా ఒకటీఅరా లారీలను దానిపైకి ఎక్కిస్తున్నారంతే. ఒకవేళ వేయింగ్ బ్రిడ్జిలు ర్యాంపుల్లో ఉంటే మితిమీరిన లోడుతో లారీలు రోడ్లపైకి ఎలా వస్తున్నాయని జనం ప్రశ్నిస్తున్నారు. తీరా రోడ్డుపైకి వచ్చిన తర్వాత కూడా మోళీనే. ఇసుక లారీని అధికారులు ఆపినా వే-బిల్లు మాత్రమే చూసి రైట్ రైట్ అనేస్తున్నారు. ఇసుక రోడ్డుపై పడుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నా జరిమానాలు రాయలేని పరిస్థితి ఉండడంతో కనీసం లోడుపై పరదా కట్టాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. అది కూడా సరిగా అమలు కావడం లేదు. చాలా లారీలు ఆ ఆదేశాలను పట్టించుకోక పోగా.. కొన్నింటికే పరదా కప్పుతున్నా భారీకాయానికి కర్చీఫ్ చుట్టినట్టు ఉంటోంది. కనీసం ఇసుక లారీల వేగానికి అడ్డుకట్ట వేయలేకపోతుండడం శోచనీయం.



బొమ్మూరు జంక్షన్‌లో



చాలీచాలని వస్త్రం కప్పి వెళుతున్న లారీ



ఎక్కువగా ప్రమాదాలు జరిగే జీరో పాయింట్ వద్ద

లక్ష్యం 3,823 ఇళ్లు.. నిర్మించినవి 717

ఇళ్ల నిర్మాణం జాప్యంపై కలెక్టర్ ప్రశాంతి అసహనం

నిర్లక్ష్యం సహించేది లేదని హెచ్చరిక



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని నాల్గవ క్వార్టర్‌కు కేటాయించిన ఇళ్ల నిర్మాణం, కన్వర్షన్ లక్ష్యాల్లో కేవలం 19 శాతం మాత్రమే పూర్తి చేయడం పట్ల జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అసహనం వ్యక్తంచేశారు. నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుతో కలసి హౌసింగ్ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ నాల్గవ క్వార్టర్‌లో 100 రోజుల కార్యక్రమం కింద జిల్లాలో 3823 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెడితే, ఇప్పటివరకూ 717 పూర్తిచేశారన్నారు. స్టేజి కన్వర్షన్ విధానంలో ప్రజల్లో అవగాహన కల్పించడంలో సరైన విధానం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆమె అసహనం వ్యక్తంచేశారు. కొవ్వూరు, సీతానగరం, చాగల్లు మండలాలో 5 శాతం, అనపర్తి, కొవ్వూరు అర్బన్‌లో 6శాతం మాత్రమే పురోగతి ఉందన్నారు. కొవ్వూరు నియోజకవర్గం మొత్తం మీద కేవలం 7 శాతం, అనపర్తిలో 8 శాతం, నిడదవోలులో 12శాతం ఉందన్నారు. పనుల వేగం పెంచాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, స్టేజి కన్వర్షన్ విషయంలో కొద్దిపాటి అవగాహన కల్పించగలిగితే మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు సమీక్ష చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో హౌసింగ్ నిర్మాణాల కోసం వార్డు, గ్రామ సంఘాల నుంచి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ కె.భాస్కర్‌రెడ్డి, కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ బీవీ గిరి, హౌసింగ్ ఐటీపర్సన్ టి.విద్యాసాగర్ పాల్గొన్నారు.

19న ఏజీ ఆధ్వర్యంలో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించిన పెన్షన్, జీపీఎఫ్ కేసులను సమీక్షించడానికి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఏపీ అకౌంటెంట్ జనరల్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్‌ఈ) అధ్యక్షతన రాజమహేంద్రవరంలోని ఆర్ట్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి ఈ అదాలత్ జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అధికారులు, డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులు వారి కార్యాలయాల్లో, శాఖల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పింఛను కేసులు, అనుబంధ సమస్యల వివరాలతో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ట్రెజరీ అధికారి ఎన్.సత్యనారాయణ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీబీఎస్.. బీ అలెర్ట్

- రోగ నిరోధక శక్తిని నశింపజేస్తున్న సిండ్రోమ్
- కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు కేసుల నమోదు



జీబీఎస్ (గులియన్ బర్రే సింద్రోమ్).. అనేది ఓ అరుదైన న్యూరో వ్యాధి.. లక్షల్లో ఒకరికి కనిపిస్తుంది. ఈ వ్యాధి బారినపడినవారికి కండరాలు బలహీనమవుతాయి. నాడీ వ్యవస్థ మీద ఇది ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం ఈ వ్యాధి బారిన పడి పలువురు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ జీజీహెచ్‌లో తాజాగా నాలుగు కేసులు నమోదయ్యాయి. ఇది ప్రాణాంతకం కాదని, సరైన చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యులు చెప్తున్నారు.

6

జనరల్ మెడిసిన్ వైద్యులు ఏమయ్యారు?


జిల్లా కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం జీటీజీహెచ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రధాన వైద్యులు ఎందుకు అందుబాటులో లేరు, ఇలాగైతే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు ఎలా అందుతాయి, డ్యూటీ డాక్టర్ లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్) వైద్యాధికారులను ప్రశ్నించారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పలు విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రధాన వైద్యులు లేకపోవడంతో అసహనం వ్యక్తంచేస్తూ అక్కడున్న వైద్యులను అడిగి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న వైద్యులు రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులంతా నిర్ణీత సమయం ప్రకారం ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని, రోగులకు సత్వర వైద్య సేవలు అందించాలని కోరారు.

రుణాల మంజూరులో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వమిత్ర పథకం కింద కచ్చితమైన భూరికార్డులను రూపొందించడానికి, ఆస్తి సంబంధిత వివాదాలు, చట్టపరమైన కేసులను పరిరక్షించడానికి యజమానులు తమ ఆస్తిని ఆర్థికంగా ఉపయోగించుకొనేలా చేయడం కోసమే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. స్వమిత్ర పథకం ప్రగతిపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 50 రెవెన్యూ గ్రామాల పరిధిలో గ్రౌండ్ ట్రూ థింగ్ పనులు జరుగుతున్నాయని, 75,388 ఎకరాలకుగాను 13,252 పూర్తి చేశారని, మిగిలిన లక్ష్యాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ వాలిడేషన్ ధ్రువపత్రాలకు సంబంధించి 33,326కిగాను 16,578 పంపిణీ చేయడం జరిగిందన్నారు. రీసర్వే మౌలిక సదుపాయాలు, పట్టాలు రూపొందించడానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీకి మద్దతు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి జిల్లా ప్రాజెక్ట్ పర్యవేక్షణకోసం ఒక బృందాన్ని నియమించామన్నారు. ఇందులో ఈవోపీఆర్డీ ఎస్వీ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎస్కే బాబ్జీ, గ్రామ కార్యదర్శి పి.రామకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె.రాజేష్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పనుల పురోగతిపై రోజువారీ ప్రగతిని పర్యవేక్షిస్తామన్నారు. ఈ పథకం ద్వారా ఆస్తి యజమానులకు చట్టపరమైన యాజమాన్య కార్డులను జారీ చేస్తుందన్నారు. సర్వేను క్షేత్రస్థాయిలో మార్గదర్శకాలననుసరించి పూర్తిచేయాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో డీపీవో శాంతామణి, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి హాకీ టోర్నమెంట్

- కాకినాడ వేదికగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్
- 18 రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 43టీంలు
- వెయ్యి మంది క్రీడాకారులు, వందమంది కోచ్‌లు రాక
- నేటి నుంచి 28 వరకు క్రీడా సంబరాలు
- అతిథులుగా రానున్న అర్జున, ఖేల్‌రత్న అవార్డు గ్రహీతలు

6



పిఠాపురం బైపాస్‌లో దట్టంగా అలముకున్న పొగ మంచు (పైన)
పిఠాపురం-గొల్లప్రోలు మధ్య 216 జాతీయ రహదారిపై పొగ మంచు (కింద)



- ఉదయం 9 గంటల వరకు తగ్గని ప్రభావం
- సాయంత్రం 4 గంటల నుంచే మరలా మొదలు
- దట్టంగా అలముకుంటున్న పొగ మంచు
- పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగినా తగ్గని చలి తీవ్రత


ఎండ తీవ్రత గణనీయంగా పెరుగుతున్నా పొగ మంచు ప్రభావం తగ్గకపోగా రోజు రోజుకీ అధికమవుతోంది. రహదారులు, పొలాలపై మంచు దుప్పటి మాదిరిగా పరచుకోవడంతో పాటు తెల్లవారుజాము సమయాల్లో రోడ్లు కనిపించని పరిస్థితి నెలకొంది.

పొగ మంచు దుప్పటి

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో భిన్నమైన పరిస్థితులతో పొగ మంచు ప్రభావం ఎక్కువైంది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు కాకినాడ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రాత్రి, పగటి వేళల్లో మంచు కురుస్తోంది. కొన్ని రోజులుగా ఉదయం 9 గంటలు దాటినా మంచు ప్రభావం తగ్గట్లేదు. సాయంత్రం నాలుగు గంటలకే మంచు కురవడం ప్రారంభమవుతోంది. బుధ, గురువారాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అన్ని ప్రాంతాల్లోనూ రహదారులు, పంట పొలాలు, నివాస ప్రాంతాలను పొగ మంచు ఆవరించింది. గురువారం గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలుగా నమోదైంది. వేడి, ఉక్కపోతలతో ప్రజలు సతమతమవుతున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. తెల్లవారుజామున 3 గంటలకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19-20 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. అర్ధరాత్రి దాటాక పొగ మంచు ప్రభావంతో రహదారులు కనిపించట్లేదు. 16, 216 జాతీయ రహదారులు, ఇతర రాష్ట్ర రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలుచోట్ల వాహనాలను రోడ్డుపక్కన నిలిపివేసి వెలుతురు వచ్చిన తర్వాత తిరిగి ప్రయాణాలు సాగిస్తున్నారు. భిన్నమైన వాతావరణంతో చిన్నారులు, పెద్దల్లో జ్వరాలు, రొంప, దగ్గు, గొంతునొప్పి, వంటి నొప్పులతో బాధపడుతూ ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. వాతావరణ మార్పులే ఇందుకు కారణమని వైద్యులు చెప్తున్నారు.



గొల్లప్రోలు-పిఠాపురం మధ్య వరి పొలాలను ఆవరించిన పొగ మంచు



జీబీఎస్ బీ అలెర్ట్

రోగ నిరోధక శక్తిని నశింపజేస్తున్న సిండ్రోమ్

కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు కేసుల నమోదు



జీజీహెచ్ (కాకినాడ), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): వైరస్ వల్ల వ్యాప్తి చెందే ఈ గులియన్ బర్రె సిండ్రోమ్ (జీబీఎస్)లో చాలా రకాలుంటాయి. ప్రధమంగా యాగ్జోనల్ వేరియంట్, డిమైనలేటింగ్ వేరియంట్ అనే రెండు రకాలుంటాయి. ఇవి వెన్నుపూస దగ్గర నుంచి కాళ్లు, చేతులు, మెడ, తలకు వెళ్లే నరాలకు వ్యాపిస్తాయి. ఇది వైరల్ జ్వరం ద్వారా వచ్చే దగ్గు, జలుబు లేదా తీవ్రమైన వాంతులు, విరోచనాలు తగ్గాక సంబంధిత వైరస్‌కు గానీ లేదా బ్యాక్టీరియాకు గానీ రక్షణ కోసం వచ్చిన కొన్ని యాంటీ బాడీస్ నరాలపై వాటి ప్రభావాన్ని చూపిస్తాయి. తద్వారా నరాలు చచ్చుబడిపోతాయి. సహజంగా వైరల్ ఫీవర్ వచ్చాక మైకో ప్లాస్మా న్యుమోనియా అనేది రావడం సహజం. అది తగ్గాక వారం, రెండు వారాల్లో నరాలు చచ్చుబడిపోవడానికి అవకాశాలు ఎక్కువ లేదంటే క్యాంపలో బ్యాక్టర్ బ్యాక్టీరియా అంటే తీవ్రమైన వాంతులు, విరోచనాలు అయ్యాక రెండు వారాలు గడిచాక జీబీ సింద్రోమ్‌గా రూపాంతరం చెందుతుంది.

లక్షణాలు: మొదట కాళ్ల వద్ద తిమ్మిర్లు ప్రారంభమై అవి చేతులదాకా పాకి పట్లు తప్పుతాయి. వణుకు ఎక్కువై మల, మూత్రాలు మందమవుతాయి. అలసట ఎక్కువగా ఉంటుంది. రక్తపోటు, మధుమేహం, గుండె చప్పుడుల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. వేసుకున్న చెప్పులు మనకు తెలియకుండానే జారిపోవడం, కింద కూర్చుని లేవలేకపోవడం. కొంతమంది మెడ నిలబెట్టలేకపోవడం, మింగలేకపోవడం, శ్వాస అందకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస కోసం పనిచేసే కండరాలు కూడా ప్రభావితమవుతాయి. ఈ వ్యాధి నాలుగు వారాలు వరకు పెరగవచ్చు లేదా ఐదు రోజుల్లోనే ఎక్కువ కావచ్చు. మరికొంతమందికి వారం, పది రోజుల వరకు పెరిగి ఆగిపోతుంది. కొంతమందికి కాళ్లు పట్టు మాత్రమే వదులుతాయి. మరి కొంతమందికి కాళ్లు, చేతులు కూడా వదులుతాయి. ఇంకొంతమందికి మెడ వాలిపోతుంది. తద్వారా ఆయాసం తీవ్రమై వెంటిలేటర్ పైకి వెళ్లే అవకాశముంది. ఈ వ్యాధి కేవలం నాలుగు వారాల వరకే పెరుగుతుంది. ఆఒక్కోసారి ప్రాణాపాయంలోకి వెళ్లకుండా చికిత్స లేకుండానే బాధితులు కోలుకుంటారు. అయితే కోలుకున్న అనంతరం ఏదో ఒక అవుకుతనంతో బాధపడతారు. వృద్ధులు, చిన్న పిల్లలపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నడి వయస్కులపై ప్రభావం చూపదు.

అప్రమత్తంగా ఉంటూ లక్షణాలు కనిపించిన వెంటనే అర్హుడైన న్యూరో ఫిజీషియన్‌ను సంప్రదించి వైద్య చికిత్స పొందితే ఈ వ్యాధి నుంచి వెంటనే విముక్తి పొందుతారు. కాకినాడ జీజీహెచ్ న్యూరాలజీ విభాగంలో అన్ని వసతులతో కూడిన వైద్య చికిత్స అందుబాటులో ఉంది.

- ఏపీలో మొత్తం 17 కేసులు నమోదు కాగా కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు వెలుగు చూశాయి.
- అతిగా ఇన్ఫెక్షన్లు, వ్యాక్సిన్లు, సర్జరీలు, ట్రామా, జన్యుపరంగానూ జీబీఎస్ వ్యాధి వచ్చే అవకాశముంది.
- ఇంట్రా వీనస్ ఇమ్యూనో గ్లోబిన్ ఇంజక్షన్ చేయించుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ సూచిస్తోంది.
- రాష్ట్రవ్యాప్తంగా 8వేల వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచామని, ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత చికిత్స అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

ప్రాణాంతకం కాదు



మన రోగ నిరోధక వ్యవస్థే మన నరాలు, కండరాలపై దాడి చేసి విచ్ఛిన్నం చేస్తుంది. జీబీఎస్ లక్ష మందిలో ఒకరికి మాత్రమే సోకే అత్యంత అరుదైన వ్యాధి. మనకు తెలియకుండానే మరణం అంచుల వరకు వెళ్లి వస్తాం. ప్రాణాంతకం కాదు.

డాక్టర్ ఎండీ షరీఫ్
న్యూరో మెడిసిన్ విభాగ ఇన్‌చార్జి, కాకినాడ జీజీహెచ్

క్రీడా సంబరానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి కాకినాడ వేదికగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్
- 18 రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 43 జట్లు
- వెయ్యిమంది క్రీడాకారులు, వంద మంది కోచ్‌లు
- ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మెరిసిపోతున్న ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ కోర్టు
- క్రీడాకారులతో నిండిపోయిన కాకినాడలో హోటళ్లు
- నేటి నుంచి 28వ తేదీ వరకు క్రీడాపోటీలు
- అతిథులుగా వస్తున్న అర్జున, ఖేల్ రత్న అవార్డు గ్రహీతలు



కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పురుషులు, మహిళల టోర్నమెంట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కాకినాడలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానం అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రీడాపోటీలను రాష్ట్ర, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలు ఆతిథ్యం ఇస్తుండగా, కాకినాడజిల్లా యంత్రాంగం సహాయ సహకారాలను అందిస్తోంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశారు. ఈటోర్నమెంట్ ప్రారంభ వేడుకలు శనివారం సాయంత్రం 4గంటకు డీఎస్‌ఏ మైదానంలో జరుగుతాయి. ఈవేడుకలకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, అర్జున, ఖేల్‌రత్న అవార్డు గ్రహీతలు అతిథులుగా హాజరుకానున్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, రీజనల్ స్పోర్ట్స్ బోర్డులు నుంచి పురుష, మహిళల టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి. సుమారు 1000 మంది క్రీడాకారులు, 100మంది కోచ్‌లు, మేనేజర్లు ఈ పోటీలలో పాల్గొననుండగా, శుక్రవారం సాయంత్రా నికి దాదాపు 650 మంది కాకినాడ చేరుకున్నారు. ఆతిథ్యం ఇస్తున్న మనరాష్ట్రం నుంచి పురుషులు, మహిళల జట్లు ఈపోటీలో పాల్గొంటున్నాయి. వీరందరికీ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీలు రైలు, బస్‌స్టేషన్లు, విమానాశ్రయాలు వద్దే స్వాగతం పలికి ప్రత్యేక బస్సులలో వారికి కాకినాడ నగరంలోని వివిధ హోటళ్లు, అతిథి గృహాల్లో బస ఏర్పాటు చేశారు. కాకినాడ నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించారు. ఈ టోర్నమెంట్‌ను అపూర్వరీతిలో నిర్వహించేందుకు జిల్లాకలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా జేసీ రాహుల్‌మీనాలు గడిచిన వారంరోజులుగా ఏర్పాట్లను నిత్యం స్వయం గా పర్యవేక్షిస్తూ, అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో 14 అం శాల వారీ ఏర్పాటుచేసిన కమిటీలు యుద్ధప్రా తిపదికన పనులు పూర్తి చేశాయి.

పోటీలో 43 జట్లు

దేశంలో ఉన్న 18రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 43జట్లు పాల్గొంటు న్నాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా, చత్తీస్‌ఘడ్, న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్, కేరళ వంటి రాష్ట్రాల నుంచి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు పాల్గొంటున్నారు. కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధ్యక్షతన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటుచేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా కన్వీనర్‌గా, డీఆర్వో వెంకట్రావు, సీపీవో త్రినాథ్ సభ్యులుగా ఉన్నారు. టోర్నమెంట్ చీఫ్ కోఆర్డినేటర్‌గా డీఎస్‌డీవో శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. మ్యాచ్‌లు వీక్షించే ప్రేక్షకులకు గ్యాలరీలు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి

వైభవంగా భీమేశ్వరుడి పుష్పోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవంలో ఆఖరి అంకమైన శ్రీపుష్పోత్సవం శుక్రవారంరాత్రి వైభవంగా జరిగింది. వేదపండితులు, అర్చకులు వేద మంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా శ్రీపుష్పోత్సవా న్ని ఘనంగా నిర్వహించారు. స్వామి,అమ్మవార్లను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై ఉన్న పీఠంపై ఉంచి పుష్పాలతో అలంకరించారు. ఈకార్యక్రమం కోసం మాణిక్యాంబ అమ్మవారిని రకరకాల పూలు, పండ్లతో అలంకరించారు. భక్తులు తెచ్చిన స్వీట్లను పూజా మందిరంలో ఉంచారు. పూజా కార్యక్ర మం అనంతరం తొలి దంపత తాంబూలాన్ని దేవస్థానం బ్రహ్మ బ్రహ్మశ్రీ దేవుల పల్లి ఫణిరామకృష్ణ దంపతులకు అంద జేశారు. ఈ పుష్పోత్సవం తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. హాజరైన భక్తులకు కొబ్బరి బొండాం, జాకెట్ ముక్క, దంపత తాంబూ లంగా అర్చకస్వాములు అందజేశారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో శయనింపచేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దుర్గాభవాని పర్యవే క్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అన్నవరం దేవస్థానం రత్న, సత్యగిరి చుట్టూ

భూ సర్వే ప్రక్రియ ప్రారంభం

- వారంరోజులపాటు కొనసాగనున్న సర్వే

అన్నవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంకు సంబంధించి రత్న, సత్యగిరిల చుట్టూ ఉన్న స్థలాలు, భూములపై శుక్రవారం నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభించారు. రావోర్ సర్వే ద్వారా త్వరితగతిన పని పూర్తవుతుందని భావించి ఈ విధానాన్ని ప్రారంభించారు. తొలిరోజు దేవస్థానం కళాశాల వెనుకభాగంలో చేపట్టగా అక్కడక్కడా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించి మార్కింగ్ వేశారు. దేవస్థానం సత్యరత్నగిరిల చుట్టూ ఆక్రమణలపై ఇప్పటికే చాలాసార్లు సర్వే చేపట్టి పూర్తికాకుండా మధ్యలో వదిలేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ సర్వే అయినా పూర్తిగా చేపడతారా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మధ్యలోనే నిలుపుదల చేస్తారా అనేది వేచిచూడాలి. ప్రస్తుతం అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు రెవెన్యూ నుంచి రావడంతో వీటిపై పూర్తి అవగాహన ఉండడంతో సర్వే అంతా పూర్తిచేయాలని ఆశించాలి. వారంరోజులపాటు సర్వే ఉంటుందని దేవస్థానం లీజుల విభాగ అధికారులు తెలిపారు. ఈ సర్వేలో లీజుల విభాగ ఏఈవో బీఎస్ రెడ్డి, సూపరింటెండెంట్ పి.వి.రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్, మండల సర్వేయర్ రాజు తదితరులు ఉన్నారు.



దేవస్థానం భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు, దేవస్థానం సిబ్బంది

‘రూసా’ పరిశోధనా ప్రాజెక్టులపై వీసీ సమీక్ష



వర్శిటీ అధికారులతో సమీక్షిస్తున్న వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) కింద వర్శిటీలో చేపడుతున్న పరిశోధనా ప్రాజెక్టులపై జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ శుక్రవారం ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా రూసా పరిశోధనా ప్రాజెక్టుల వివరాలను అధికారులను అడిగి వీసీ తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయంలో పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా 9 పరిశోధనా ప్రాజెక్టులకు రూ.93లక్షలు రూసా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రెండేళ్ల పాటూ చేపట్టనున్న ఈ పరిశోధనా ప్రాజెక్టులకు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లు ప్రాజెక్టు ఫెలోను త్వరితగతిన నియమించుకోవడంతో పాటూ పరిశోధనలకు అవసరమైన పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. 9 పరిశోధనా ప్రాజెక్టులకు సంబంధించినజర్నల్స్‌ను ప్రచురితమయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమీక్షకు రూసా సమన్వయకర్త, వైస్ ప్రిన్సిపాల్ ఎం.స్వరూపారాణి అధ్యక్షత వహించగా, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, మాజీ ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, వి.శ్రీనివాసులు, బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు

తమిళనాడు యువకుడి సైకిల్ యాత్ర

ఆత్రేయపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ విదేశాలలో మొక్కలు నాటుతూ ఆక్సిజన్ శాతాన్ని వాతావరణంలో పెంపొందించేందుకు తమిళనాడుకు చెందిన యువకుడు ముత్తు సెల్వాన్ పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్‌పై యాత్ర చేపట్టాడు. 32,200 కిలోమీటర్ల దూరాన్ని 1111 రోజుల్లో ప్రయాణించి పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం సైకిల్‌పై సాహసయాత్ర చేపట్టాడు. 2021 డిసెంబరు 28న సైకిల్‌యాత్రను ప్రారంభించిన సెల్వాన్ శుక్రవారం జిల్లాలోని ఆత్రేయపురం చేరుకున్నాడు. తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూరుకు చెందిన సెల్వాన్ ఈ సాహసయాత్ర చేపట్టాడు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సెల్వాన్ కలిసి తన సైకిల్‌యాత్ర కోసం వివరించాడు. భారత దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ తదితర దేశాలలో సైకిల్ యాత్ర ద్వారా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సెల్వాన్‌ను ఎమ్మెల్యే సత్యానందరావు, ఆయన తనయుడు సంజీవ్ దుశ్శాలువాతో సత్కరించి ఆర్థిక సాయం అందజేశారు.



సైకిల్ యాత్ర చేస్తున్న సెల్వాన్‌ను సత్కరిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

విద్యార్థిపై కోడికత్తితో దాడి

● కరప మండలం యండమూరులో ఘటన
● తారాజువ్వల కాల్చివేత విషయంలో గొడవ...
● పోలీస్ పికెట్ ఏర్పాటు


దాడిలో తీవ్రంగా గాయపడిన ఈశ్వరరావు

కరప, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం యండమూరులో గురువారం రాత్రి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తారాజువ్వల విషయంలో తలెత్తిన వివాదం చినిచినికి గాలివానలా మారింది. ఒక విద్యార్థిపై కొంతమంది యువకులు కోడి కత్తితో దాడిచేసి తీవ్ర సంచలనం సృష్టించారు. కరప పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం. యండమూరుకి చెందిన కురుపూడి ఈశ్వరప్రసాద్ కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 8వ తేదీన స్థానిక మీసాల వెంకన్నకల్యాణ ఉత్సవాల్లో భాగంగా జరిగిన రథం ఊరేగింపులో ఈశ్వరప్రసాద్, అతని స్నేహితులు తారాజువ్వలు వేయగా, అదే గ్రామానికి చెందిన మారెళ్ల అజయ్, గుబ్బల కాలేబు, జిజెల్ అనే యువకులు వారి వద్దకు వెళ్లి కావాలనే తమపై తారాజువ్వలు వదిలినట్టు ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగి, మీ అంతు చూస్తామంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. తిరిగి మళ్లీ 13వ తేదీన కాలేజీలో ఉన్న ఈశ్వరప్రసాద్‌కు మారెళ్ల అజయ్ ఫోన్ చేసి సాయంత్రం ఇంటికి రాగానే వెంకన్నబాబు గుడి వద్దకు చేరుకోవాలని చెప్పాడు. దీంతో భయపడిన ఈశ్వరప్రసాద్ గ్రామానికి చెందిన గుబ్బల సాయి, పితాని శేఖర్‌ను వెంటబెట్టుకుని మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. అజయ్ వద్దకు ఈశ్వరప్రసాద్ వెళ్లి మాట్లాడుతుండగా కాలర్ పట్టుకుని కిందకు తోసేశాడు. అక్కడే ఉన్న అజయ్ స్నేహితులు కాలేబు, విజయ్, వినోద్, అనిల్, మనోహర్, లచ్చన్న కిందపడ్డ ఈశ్వరప్రసాద్‌ను కదలకుండా గట్టిగా పట్టుకోవడంతో అజయ్ చంపాలన్న ఉద్దేశంతో కోడికత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. ఈ దాడిలో ఈశ్వరప్రసాద్ తల, ఎడమ, కుడి పక్కన నుదిటిమీద, ఎడమ భుజం, కుడి చాతిపైన తీవ్ర గాయాలయ్యాయి. దీంతో షాక్‌కు గురైన ఈశ్వరప్రసాద్ స్నేహితులు సాయి, శేఖర్, అదే సమయంలో అటుగా వెళ్తున్న వెంకటేష్, దుర్గాప్రసాద్, సాయికృష్ణ అజయ్ మిత్రబృందం నుంచి కాపాడి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలోని రెండువర్గాల మధ్య తీవ్ర దుమారం రేగింది. విషయం తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప, పెదపూడి, గొల్లపాలెం, కోరంగి, తిమ్మాపురం, ఇంద్రపాలెం ఎస్ఐలు తోట సునీత, రామారావు, సత్యనారాయణరెడ్డి, మోహన్‌కుమార్, వీరబాబు, రవీంద్ర, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. దాడిలో ఉపయోగించిన కోడికత్తి, ఇతర ఆధారాలను సేకరించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. తీవ్రంగా గాయపడిన బాధితుడు, అతని మిత్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఎస్ఐ సునీత తెలిపారు.


ఘటనాస్థలంలో ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ సునీత, పోలీస్ సిబ్బంది

45 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

● వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు


రమణక్కపేట ఉన్నత పాఠశాల సమీపంలో బియ్యం లోడుతో ఉన్న వ్యాన్

కొత్తపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 45 టన్నుల రేషన్ బియ్యాన్ని కాకినాడ జిల్లా కొత్తపల్లి ఎస్ఐ జి. వెంకటేష్ పట్టుకొన్నారు. శుక్రవారం తన సిబ్బందితో రమణక్కపేటకు వెళుతుండగా, ఊరుచివర ఉన్న జడ్పీ హైస్కూల్ వద్ద ఓ వ్యాన్‌ను గుర్తించారు. అను మానం వచ్చి దాన్ని పరిశీలించగా రేషన్‌బియ్యం ఉన్నాయి. దీన్ని గుర్తించి తహసీల్దార్ జి. చిన్నారావుకు సమాచారమిచ్చారు. దీంతో సామర్లకోట సివిల్‌సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ కమల వెళ్లి స్వాధీనపర్చుకున్నారు. గొల్లప్రోలుకు చెందిన వీ. లక్ష్మణ్ అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. బియ్యాన్ని పిఠాపురం సివిల్ సప్లయిస్ పాయింట్‌కు తరలించారు. లక్ష్మణ్‌పై 6ఏ కేసుతో పాటు కొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సీఎస్‌డీటీ కమల చెప్పారు.

పొలంలో ఎరువు వేస్తూ ...

అస్వస్థతకు గురై యువ రైతు మృతి


మోర్త నాని (ఫైల్)

కె.గంగవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వరి పొలంలో ఎరువులు, గుళికలు వేస్తూ అస్వస్థతకు గురై ఓ యువరైతు మృతిచెందాడు. కోనసీమ జిల్లా పామర్రులో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుఉంది. ఎస్ఐ ఎస్కే జానీ బాషా తెలిపిన వివరాలివి. పానింగపల్లికి చెందిన మోర్త నాని (28) అనే యువ రైతు తను చేస్తున్న కౌలు పొలంలో ఎరువులు వేస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. అయితే ఉదయం వెళ్లిన నాని ఎంతకూ రాకపోవడంతో తండ్రి ఆనందరావు పొలం దగ్గరకు వెళ్లి చూసేసరికి అప్పటికే అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. తొలుత అతన్ని పామర్రు ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం రామచంద్రపురం తరలించారు. ఈలోగా ఆసుపత్రికి చేరే సరికే మృతిచెందాడు. నాని తండ్రి ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వైసీపీ కౌన్సిలర్లు, నాయకులపై కేసు

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):తహశీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసి, తప్పుడు పట్టాలను టాంపరింగ్‌కు పాల్పడిన వైసీపీ కౌన్సిలర్లు, నాయకులపై పెద్దాపురం పోలీస్టేషన్లో కేసులు నమోదు చేసినట్టు శుక్రవారం పెద్దాపురం పోలీసులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే గత ఏడాదిలో జరిగిన ఈ అక్రమ ఫోర్జరీ, ట్యాంపరింగ్ వ్యవహారంపై పెద్దాపురం కౌన్సిల్‌లో పెద్ద ఎత్తున దుమారం చెలరేగిన విషయం పాఠకులకు విదితమే. ప్రభుత్వ పోరంబోకు పుంతభూమికి ఫోర్జరీ పట్టాలు రూపొందించి ఎస్టీలకు అక్రమంగా రూ. 1.30 లక్షలకు విక్రయించిన సంఘటనపై అప్పట్లో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దాపురం ఆర్డీవో జేఎస్ రామారావుకు ఫిర్యాదు చేయగా, తహశీల్దార్ వెంకటలక్ష్మిని విచారణ అధికారిగా నియమించారు. ఈ క్రమంలో విచారణ జరిపిన అనంతరం పట్టాలు ఫోర్జరీ చేసినట్టుగా తహశీల్దార్ గుర్తించారు. దీంతో తదుపరి చర్యల నిమిత్తం ఆర్డీవోకు నివేదికలు సమర్పించారు.

ఈ మేరకు రెవెన్యూ అధికారుల ఆదేశాలతో పెద్దాపురం ఎస్ఐ మౌనిక ఫోర్జరీ, ట్యాంపరింగ్, అక్రమ విక్రయాలు, చీటింగ్ నేరాలకు సంబంధించి ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు, ఇద్దరు వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైలు ఢీకొని.. గుర్తు తెలియని వ్యక్తి మృతి


పోలీసులు గుర్తించిన మృతదేహం

తుని రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. డీమార్ట్ వెనుక మూసివేసి ఉన్న గేటు వద్ద సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈయనకి సంబంధించినవారు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసుల నెంబర్ 9490619020కు కాల్ చేయాలన్నారు.

లక్ష్మీదేవిపేటలో 48 ఇళ్లు కూల్చివేత

● పట్టాభూమిలో నిర్మించడంతో కలెక్టర్ ఆదేశాలతో చర్యలు


జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఎటపాక, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీదేవిపేట రెవెన్యూ గ్రామ పరిధి పట్టాభూమిలో నిర్మించుకున్న 48 ఇళ్లను శుక్రవారం తెల్లవారు జామున రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో కూల్చివేశారు. జిల్లా కలెక్టర్, చింతూరు ఐటీడీఏ పీవో ఆదేశాలతో కూల్చివేతకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆపరేషన్‌లో భాగంగా తెల్లవారు జామున ఎటపాక తహశీల్దార్ కారం సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది, విలీన మండలాల్లోని పోలీసు అధికారులు బలగాలతో లక్ష్మీదేవిపేటలోని ఇళ్ల వద్దకు జేసీబీతో చేరుకున్నారు. ఇళ్లల్లోని సామగ్రిని బయటకు తీసి, పోలీసు బలగాల నడుమ జేసీబీలతో ఇళ్లన్నీ కూల్చివేశారు. తాటాకు ఇళ్లతో పాటు రేకులతో నిర్మించిన మెత్తం 48 ఇళ్లను నేలమట్టం చేశారు. అయితే రాష్ట్ర సరిహద్దులో ఉన్న 2 ఎకరాల 25 సెంట్ల భూమిలో నాలుగైదు ఏళ్ల క్రితం అల్లూరి జిల్లాలోని కూనవరం, వరరామచంద్రపురం, చింతూరుతోపాటు తెలంగాణలోని భద్రాద్రి జిల్లా చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన గిరిజనులు ఇక్కడ ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారు. ఇటీవల ఈ భూమి గల యజమాని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు తన పట్టా భూమిని ఆక్రమించి, ఇళ్లు నిర్మించుకున్నారని ఫిర్యాదుచేశాడు. దాంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేశారు. తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదని, ఉన్న పళంగా కూల్చితే ఎక్కడకి వెళ్లాలంటూ బాధితులు వాపోయారు. కూల్చివేతల అనంతరం కొందరు బాధితులతో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. ఎటపాకలో ప్రభుత్వ స్థలాన్ని సర్వేచేసి మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో తహశీల్దార్ సుబ్బారావుకు ప్రభుత్వ స్థలాల సర్వే నిర్వహించి, నివేదిక పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా భూ పట్టా కలిగిన యజమాని 2023 సంవత్సరంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానమైన హైకోర్టును ఆశ్రయించి, తనకు అనుకూల తీర్పును పొందారని తహశీల్దార్ వెల్లడించారు. కాగా ఈ ఇళ్ల కూల్చివేత ఆపరేషన్‌లో సుమారు 150 పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

పెనుగుదురులో చోరీ

బంగారం, వెండి ఆభరణాల అపహరణ

కరప, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కరపమండలం పెనుగుదురులోని ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.60 వేలు విలువచేసే బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుగుదురు గ్రామానికి చెందిన పబ్బిసెట్టి అప్పారావు ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి పాయకరావుపేట మండలం సచ్చివరం గ్రామంలోని బంధువుల ఇంటికి భార్యతో కలిసి వెళ్లారు. తిరిగి 12న ఇంటికి రాగా ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా 8గ్రాములు ఉండే రెండు జతల బంగారు చెవిదిద్దులు, 550గ్రాముల అష్టలక్ష్మి వెండిచెంబు, 300గ్రాములున్న రెండు వెండిగిన్నెలు, 200గ్రాములున్న రెండు వెండి దీపం కుందెలు వెరసి మొత్తం రూ.60వేలు విలువచేసే ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీనిపై కరప పోలీసులకు ఫిర్యాదుచేయగా కాకినాడ నుంచి క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించింది. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

‘పేరాబత్తుల’పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సుందర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లఘించారని, అతడిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ దూరప్రాంతాల్లో ఉన్నవారికి బస్సు, రైలు టిక్కెట్లు బుక్ చేసేందుకు ఒక వాట్సాప్ నెంబరును రాజశేఖర్ వినియోగిస్తున్నారని, దానికి మెసేజ్ పెడితే స్పందించి ఓటరా కాదా అని నిర్ధారించుకున్నాక ట్రావెల్స్ సమాచారం అడిగి, టిక్కెట్ బుక్ చేసినట్టు మెసేజ్ పెడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు మెయిల్‌లో ఫిర్యాదు చేశానని, కాని స్పందన లేదన్నారు. ఎన్నికల సంఘం స్పందించి రాజశేఖరంను అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


నాగేశ్వరరావు(ఫైల్)

అంతర్వేది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామంలో శుక్రవారం విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఉండపల్లి నాగేశ్వరరావు(49) రొయ్యల చెరువు సాగుచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి మేత వేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతడిని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మేరకు భార్య వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా నాగేశ్వరరావుకు భార్య, కుమార్తె ఉన్నారు.

డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువకు 2650 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1800 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8465 క్యూసెక్కులుగా ఉండగా, గోదావరి నీటి మట్టం 9.45 అడుగులుగా నమోదయింది

కుంతీమాధవుడి హుండీల లెక్కింపు



పిఠాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవ స్వామి దేవస్థానంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. ఏడాది కాలానికిగానూ రూ.2లక్షల71వేల495 ఆదాయం లభించింది. లెక్కింపులో ఆలయ ఈవో నున్న శ్రీరాములు, దేవదాయశాఖ సిబ్బంది, కుంతీమాధవ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

సీతానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భర్త కనిపించడం లేదని భార్య జరీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వెలమపేట గ్రామానికి చెందిన షేక్ సర్కార్(40) గ్రామాల్లో తిరుగుతూ పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తుంటాడు. గత ఏడాది మార్చిలో జరీనా మస్కట్ వెళ్లింది. ఆమె వెళ్లిన పది రోజులకు సర్కార్ వ్యాపారం నిమిత్తం వెళ్లి తిరిగి రాలేదు. ఇటీవల మస్కట్ నుంచి తిరిగి వచ్చి జరీనకు భర్త కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు

నరసన్న ఆదాయం రూ.47,89,784

కల్యాణోత్సవాల్లో భాగంగా 17 రోజుల హుండీలు లెక్కించిన అధికారులు


హుండీలో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

అంతర్వేది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం దేవస్థానంలో హుండీలను లెక్కించారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.46,76,268, గుర్రాలక్కమ్మ హుండీ ఆదాయం రూ.82,241, అన్నదాన హుండీ ఆదాయం రూ. 27,275 వెరసిరూ.47,89,784 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి. సత్యనారాయణ తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా 17 రోజులకుగాను స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించగా 8.500 మి.గ్రా. బంగారం, 104.370 మి.గ్రా. వెండి, విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు. స్వామివారి అనుబంధ ఆలయమైన నీలకంఠేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.47, 587 ఆదాయం వచ్చిందని ఏసీ తెలిపారు. కార్యక్రమంలో డీసీ డీఎల్వీ రమేష్‌బాబు, చైర్మన్ ఫ్యామిలీమెంబర్ రాజాకలిదిండి కుమారరామ గోపాల రాజాబహదూర్, ఉత్సవ సేవాకమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఎంపీటీసీ బైరా నాగరాజు, తనిఖీ అధికారి జె. రామలింగేశ్వరరావు, విశ్రాంత ఈవో బి.వెంకటేశ్వరరావు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

20 నుంచి జాతీయస్థాయి యువజనోత్సవాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 20, 21, 22 తేదీల్లో ఉద్భవ్ - 2025 పేరుతో జాతీయస్థాయి యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థుల్లోని వ్యాపార నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశ్యంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యకలాపాలను కూడా భాగం చేశామని, విద్యార్థులతో వ్యాపార స్టాల్స్‌ను ఏర్పాటు చేసి నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే ఆహారం, ఆటలు, ఫ్యాషన్ తదితర స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

● అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రహదారిపై వాహనాలు నడిపే వారంతా తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఏకేసీ కళాశాల రోటరీహాలులో బీమా క్లెయిమ్స్ పట్ల వాహనచోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు - 2025లో భాగంగా జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో శ్రీలక్ష్మి మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించడం ఎంత ముఖ్యమో బీమా చేయించుకోవడం అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులమేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈశ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం వల్ల అసంఘటితరంగ కార్మికులకు సామాజిక, ఆర్థిక భద్రత ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సీహెచ్ సంపత్‌కుమార్, ఎం.రవికుమార్, జి.రాంనారాయన్, కె.చైతన్య సుమ, జి.రాధికా దేవి, వీవీవీ సాయికుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వల్లి, కార్మికశాఖ అధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రఘుదేవపురం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సస్పెన్షన్

సీతానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గతంలో తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన అప్పారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందాయని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎన్ మూర్తి శుక్రవారం తెలిపారు. 2023-24లో రఘుదేవపురం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అప్పారావు పంచాయతీ నిధులు రూ.15 లక్షలు దుర్వినియోగం చేసినట్టు ఫిర్యాదులు అందడంతో అతడిని సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. సస్పెండ్ అయిన అప్పారావు ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారని ఈవోపీఆర్డీ పేర్కొన్నారు.

మార్చి 14న రాజమహేంద్రవరంలో

ప్రభుత్వ ఉద్యోగుల నగర మహాసభ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా మార్చి 14న రాజమహేంద్రవరం నగర మహాసభ నిర్వహిస్తున్నామని, ఈ సభలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్‌వర్మ కోరారు. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో సంఘం నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దనున్న చందాసత్రంలో రాజమహేంద్రవరం నగర మహాసభ జరుగుతుందని అన్నారు. కొత్త ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకునేలా సంఘం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లోనూ ఉద్యోగుల సభలను జరుపుతున్నామని పేర్కొన్నారు. సభ విజయవంతానికి నగర, జిల్లా కమిటీలు సంయుక్తంగా పనిచేయాలని ప్రసాద్ వర్మ కోరారు. నగర అధ్యక్షుడు జీబీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్, నగర కార్యదర్శి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా


రాజమహేంద్రవరంలో ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎన్.లక్ష్మీపతిరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరావు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో కొత్త నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగుల నియామకాలు నిలిపివేయాలని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల సమ్మెకు వెళ్లేందుకు సిద్ధమని అన్నారు. యూనియన్ నాయకులు శేషుకుమార్, పాపారావు మాట్లాడుతూ ఐదు రోజుల పనిదినాలు అమలు పర్చాలని, ఉద్యోగులకు ఇచ్చే సంక్షేమ ప్రయోజనాలపై ఇన్ కం ట్యాక్సు మినహాయింపు ఇవ్వాలని అన్నారు. మార్చి 3న పార్లమెంట్ నెదుట ధర్నా నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు శ్రీనివాస్, మురళీధర్, అప్పారావు, శేఖర్, స్వాతి, కీర్తన, సోమరాజు, రమేష్, వెంకటేశ్వరావు, ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

సూట్‌కేస్ పోయిందని ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆవ రోడ్ అల్యూమినియం కాలనీకి చెందిన వి.దుర్గ తాను శుక్రవారం ఉదయం ఇంటి నుంచి తిరిగి వచ్చే సరికి ఇంటిలోని ఓ సూట్‌కేస్ కనబడడం లేదని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సూట్‌కేస్‌లో మూడు కాసుల బంగారు వస్తువులు, 250గ్రాముల వెండి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 38 మంది విద్యార్థుల గైర్హాజరు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు-25లో భాగంగా శుక్రవారం జనరల్, ఒకేషనల్ విభాగాలకు నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలకు 3642 మంది విద్యార్థులకు 38 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి నరసింహం తెలిపారు.

జిల్లాలో 92 పోలింగ్ కేంద్రాలు

27న ఎమ్మెల్సీ పోలింగ్.. విధుల పట్ల పూర్తి అవగాహన ఉండాలి

పీవోలు, ఏపీవోల శిక్షణలో డీఆర్వో సీతారామమూర్తి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఆర్వో సీతారామమూర్తి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ద్వైవార్షిక పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరుగుతుందని, అందుకు పూర్తి అవగాహనతో సిబ్బంది ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి సూచించారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన డీఆర్వో సీతారామమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 92 పోలిం గ్ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారని, వాటిలో 102 మంది పీవోలు, 102 మంది ఏపీవోలు నియమించామన్నారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ఎమ్మెల్సీ ఎన్నికలతో పోలిస్తే భిన్నంగా ఉంటాయన్నారు. బ్యాలెట్ పద్ధ తిలో జరిగే ఎన్నిక కాబట్టి సమయం ఎక్కువ పడుతుందన్నారు. 27న ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలైన్‌లో ఉన్నవారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నా రు. పోలింగ్‌కు ఒకరోజు ముందుగానే 26న ఉదయం 8గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందాలతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూ చించారు. పోలింగ్ సామగ్రిని అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకువెళ్లరాదని, వాటికి అనుమతులు లేవన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులు తీసుకుని, వాటిని నిర్దేశించిన రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టంచేశారు. ఎట్టి పరిస్థితుల్లో బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీవో లు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలన్నారు. అనంతరం పోలింగ్ నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతుల్లో కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు, పీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్‌ఎంసీ అదనపు కమిషనర్



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీవీ రామలింగేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ కు మొక్కను అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్‌కు కలెక్టర్ అభినందనలు తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఇక్కడ నిర్వహించే బాధ్యతలు కీలకమన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గంకు చెందిన రామలింగేశ్వర్ 2011లో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో విధుల్లో చేరారు. అనంతపురం కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై రాజమహేంద్రవరం వచ్చారు.

శిక్షణతో అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం

పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో రాజానగరం ఐసీడీఎస్ ఏసీడీపీవో కనకవల్లి



పాతతుంగపాడులో మాట్లాడుతున్న కనకవల్లి

దివాన్‌చెరువు/రాజానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు మరింత బలోపేతం అయ్యేందుకు పోషణ్ బీ పడాయి బీ శిక్షణ దోహదపడుతుందని రాజానగరం ఐసీడీఎస్ ఏసీడీపీవో టి.కనకవల్లి అన్నారు. రాజానగరం, పాతతుంగపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పోషణ్ బీ పడాయి బీ శిక్షణ రెండో రోజు కార్యక్రమాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలలో ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య(ఈసీసీఈ) నిర్వహణ, పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహద పడే విధంగా ఆటపాటలతో అంగన్‌వాడీ కేంద్రాలను ఏవిధంగా నిర్వహించాలో ఈ శిక్షణ ద్వారా మరింత అవగాహన పెంపొందించుకోవచ్చునని అన్నారు. చిన్నారుల దత్తత ప్రక్రియ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, పోక్సో చట్టంలను విపులంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భూదేవి, దుర్గామణి, దివాన్‌చెరువు, పుణ్యక్షేత్రం సెక్టార్లలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంభమేళాకు మూడు సూపర్ లగ్జరీ బస్సులు

ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి భక్తులతో కూడిన మూడు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరి వెళ్లాయి. శుక్రవారం డిపో వద్ద ఈ బస్సులను ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక్కో బస్సులో 35 మంది భక్తులు ఉన్నారని, ఈ యాత్రలో భక్తులకు భువనేశ్వర్, పూరి, కోణార్క్, గయ, బుద్ధగయ, వారణాసి, అరసవల్లి క్షేత్రాలు చూపిస్తారన్నారు. యాత్ర పూర్తి చేసుకుని భక్తులంతా ఈనెల 22న తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటారని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్బం, ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోను రాణించాలి

భాష్యం స్పోర్ట్స్ మీట్ ప్రారంభంలో డీఎస్పీ రమేష్ బాబు, డీఈవో వాసుదేవరావు



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ రమేష్‌బాబు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు, డీఈవో వాసుదేవరావు అన్నారు. స్థానిక రైల్వే క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన భాష్యం స్కూల్స్ ఈస్ట్‌జోన్ బా లుర ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను వారు ముఖ్యఅతిథులుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆటలతో మానసికోల్లాసం కలుగుతుంద న్నారు. అనంతరం కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి ఆంజనేయులు, ప్రిన్సిపాల్స్ పి.హరిబాబు, కేవీవీ సత్యనారాయణ, పి. దుర్గాప్రసాద్,పార్వతిరెడ్డి, వై.రాహుల్, జె.సూర్య నారాయణ, పి.పేరయ్యనాయుడు పాల్గొన్నారు.

నాడు విగ్రహ ప్రతిష్ఠను అడ్డుకున్నపుడు

ఏమైంది సనాతన ధర్మం?

చిన పొలమూరు వాసులు

అనపర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది చిన పొలమూరులో జరగాల్సిన ఆలయ విగ్రహ ప్రతిష్ఠను పోలీసులు సహాయంతో నిలుపుదల చేసినపుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి సనాతన హిందూ ధర్మం గుర్తుకు రాలేదా అని కూటమి నాయకుడు కొశెట్టి శ్రీను ప్రశ్నించారు. శుక్రవారం చిన పొలమూరులోని గణపతి ఆలయం వద్ద అయన గ్రామస్థులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కొత్తూరు గ్రామంలో అనుమతులు లేకుండా ఆలయ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకోవడంతో మాజీ ఎమ్మెల్యే స్పందించిన తీరు సరికాదన్నారు. చిన పొలమూరులో ప్రతిష్ఠకు తెచ్చిన విగ్రహాలకు గ్రామస్థులు రెండు నెలలు పూజలు నిర్వహిస్తే రాజకీయ లబ్ధి కోసం ఆ విగ్రహాలను కాదని అప్పటికప్పుడు కొత్త విగ్రహాలను తెప్పించి ప్రతిష్ఠ జరిపించారని విమర్శించారు. సమావేశంలో దంగేటి భాస్కరరావు, గుత్తుల బుజ్జి, నరాల శ్రీను, నురుకుర్తి ప్రసాద్, సత్తిబాబు, కుక్కల ఈశ్వరరావు, కొశెట్టి నాగమణి, వనుము మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఆలయాల ప్రతిష్ఠ పూజలు

రాజానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రద్వారబంధంలో నిర్మించిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి, రాజానగరంలో నిర్మించిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం పలు హోమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా గణపతిపూజ, జల, క్షీర, ధాన్య, పుష్ప, వస్త్రాధివాసాలు, గణపతిహోమం, లక్ష్మీకుబేర సుదర్శనహవనం జరిపారు. పునఃపూజలు, సూర్యనమస్కారాలు, మహా చండీహోమం వేదపండితుల మంత్రోచ్ఛలతో కన్నుల పండువగా జరిపించారు. రాజానగరంలోని ఆర్యవైశ్యులు కోలాట ప్రదర్శనలతో అందరిని అలరించారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలకు

విశేష పూజలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు కూడలిలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ సముదాయంలో ద్వాదశ జ్యోతిర్లాంగాలకు, కాశీవిశ్వేశ్వరస్వామికి శుక్రవారం విశేషపూజలు, అభిషేకాలు జరిగాయి. పండితులు స్వామి అమ్మవార్లకు, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరపగా ద్వాదశర్లింగాలకు భక్తులే స్వయంగా అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక లలిత సహస్రనామ పారాయణం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రౌతు తాతాలు వర్ధంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని రంభ, ఊర్వశి, మేనక థియేటర్ల వ్యవస్థాపకుడు దివంగత రౌతు తాతాలు 45వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులు థియేటర్ ఆవరణలో నిర్వహించారు. తాతాలు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం థియేటర్ సిబ్బంది, కూరగాయల మార్కెట్ జట్టు కార్మికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రౌతు శ్రీనివాస్, సూర్య వరుణ్, రౌతు కిరణ్, ఆర్‌వీ అప్పారావు, ఇయ్యపు మాధవ్, ఇయ్యపు మురళి పాల్గొన్నారు.

హాస్య నటుడు

రాజబాబు వర్ధంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్యనటుడు రాజబాబు 42వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గోదావరి గట్టున ఆయన విగ్రహానికి పలువురు అభిమానులు పూలమాలలతో నివాళులర్పించారు. సోదరుడు బాబీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేనల్లుడు బీఎస్‌ఎన్‌ఎల్ వాసు, రాజబాబు మిత్రమండలి మునిని వెంకటేశ్వరరావు, సుందరం, కట్లా చంద్రరావు, పట్నాయక్, గణేష్, బాలాజీ, శివాజీ పాల్గొన్నారు. బాబీ మాట్లాడుతూ రాజబాబు 550 పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారని, అయన చేసిన గుప్తదానాలు అందరి మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోతారన్నారు.

నేటి నుంచి సీతానగరం-వాడపల్లి

బస్సు సర్వీసు

సీతానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి సీతానగరం నుంచి వాడపల్లి వెంకన్న ఆలయం వరకు రెండు బస్సులు నడపనున్నట్లు జనసేన నాయకులు మట్ట వెంకటేశ్వరరావు, వాకపల్లి సూరిబాబు తెలిపారు. ఈ మేరకు మండలంలోని భక్తులకు సమాచారం అందించారు. మండలం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వెంకన్న దర్శనానికి వాడపల్లి వెళుతున్నారని, ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు. వారి ఇబ్బందులు చూసి తమతోపాటు నాయకులు వలవల రాజా, రాపాక వెంకటలక్ష్మి స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి బస్సులు ఏర్పాటు చేసినట్టు వెంకటేశ్వరరావు అన్నారు.

కోరుకొండలో శ్రీ రంగనాథుడి

అధ్యయనోత్సవాలు

కోరుకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కోరుకొండ తిరునాళ్ల సందర్భంగా 6వ రోజున స్థానిక రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. భీష్మ ఏకాదశి రోజున ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ అధ్యయనోత్సవాలు 5రోజుల పాటు కొండపైన నిర్వహించిన అనంతరం 2రోజులు పాటు రంగనాథ స్వామి ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం రంగనాధ స్వామి ఆలయం వద్ద బేడా ఉత్సవం, సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్టి జరిగింది.

నేటి నుంచి అనంత పద్మనాభుడి అధ్యయనోత్సవాలు

రంగనాథస్వామి అధ్యయనోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం నుంచి రెండు రోజులు పాటు అనంతపద్మనాభ స్వామికి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అన్నవరం దేవస్థానం ఈవో, కోరుకొండ దేవస్థాన ధర్మకర్త, అధ్యక్షుడుక పరాసర రంగరాజభట్టర్ తెలిపారు.

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆల్‌కట్ గార్డెన్స్‌కి చెందిన ఓ యువతి(29) ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి ఫిర్యాదుతో టూటౌన్ పోలీసుల కేసు నమోదు చేశారు.

డీజీపీని కలిసిన అభిరామ్

సీతానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు గాని, వ్యక్తులను కించపరిచే పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పెందుర్తి అభిరామ్ కోరారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభిరామ్ మాట్లాడుతూ డీజీపీని కలసి నియోజకవర్గంలోని పలు అంశాలపై మాట్లాడినట్టు చెప్పారు. సోషల్ మీడియాలో వ్యక్తులను కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరగా అందుకు డీజీపీ సానుకూలంగా స్పందించి చర్యలకు హామీ ఇచ్చినట్టు అభిరామ్ పేర్కొన్నారు.

నిస్వార్థ నేత సంజీవయ్య

» ఎస్పీ నరసింహ కిషోర్

» ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి జయంతి

» ఘనంగా నివాళులర్పించిన అధికారులు, నాయకులు



సంజీవయ్య చిత్ర పటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రాష్ట్ర అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ నేత దామోదరం సంజీవయ్య అని ఎస్పీ నరసింహ కిషోర్ కొనియాడారు. దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య ఖ్యాతి గడించారన్నారు. విప్లవాత్మక పథకాలతో ప్రజల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు. తాను నమ్మిన విలువలకు జీవితాంతం కట్టుబడిన సంజీవయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ(ఎస్‌బీ) బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత వ్యక్తిత్వం: డీఆర్వో

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికి ఆదర్శనీయుడన్నారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు దేశంలో కార్మిక, విద్యాశాఖల్లో పలు సంస్కరణలు చేసి రూపొందించిన చట్టాలు వివిధ వర్గాలకు ఎనలేని మేలు చేశాయని చెప్పారు. బోనస్ చట్టాన్ని ప్రవేశ పెట్టడంతో ఆయనకు బోనస్ సంజీవయ్యగా పేరు వచ్చిందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎం.సందీప్, డీఎస్‌డబ్ల్యూ ఈవో డి.ప్రసాద్, హాస్టల్ వార్డెన్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూల్‌కు సంజీవయ్య పేరు పెట్టాలి

దామోదరం సంజీవయ్య పేరు ఆయన జన్మస్థలమైన కర్నూల్ జిల్లాకు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఎసీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి కోరారు. స్థానిక గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సంజీవయ్య జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొంకి రమేష్, సోమాబత్తుల విజయకుమార్, జంగం సుబ్బారావు, మానుకొండ డేవిడ్, కుసుమ వీరాస్వామి, ఉసురుమర్తి రామారావు, మోతా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మెగా డీఎస్సీ

» ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

» పలుచోట్ల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కొత్తూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు/అనపర్తి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): త్వరలోనే రాష్ట్రంలో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కూటమి నాయకులతో కలిసి బిక్కవోలు మండలం రంగాపురం, అనపర్తి శివారు కొత్తూరులో ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. రంగాపురంలోని మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయులను, సచివాలయ సిబ్బంది, గ్రామంలోని పట్టభద్రులకు కలసి కరపత్రాలను పంపిణీ చేసి రాజశేఖరానికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమాల్లో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పాలచర్ల శివప్రసాద్ చౌదరి, దుర్గారెడ్డి, డీవీఆర్, నడింపిల్లి చిరంజీవిరాజు, కానేటి అప్పలస్వామి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి శేషారత్నం, మామిడిశెట్టి శ్రీను, గొలుగూరి ప్రకాశరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వేగిరెడ్డి రాధ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని టీడీపీ సీనియర్ నేత ఎస్.రాజీవ్ కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-2047 ధ్యేయంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు, యువతకు 20లక్షలకు పైగా ఉద్యోగాలు లక్ష్యంగా పరిశ్రమలు, పెట్టుబడుల కోసం మంత్రి లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరానికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పట్టభద్రులైన ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి విజ్ఞానవంతుడైన రాజశేఖరం ను గెలిపించాలన్నారు. అలాగే క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జులు ప్రత్యేకంగా దృష్టిపెట్టి తమ పరిధిలోని ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు.

కోరుకొండ: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలంటూ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్, కాలేజీలకు, పాఠశాలలకు వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, అడ్డాల శివ, తెలగంశెట్టి శివ, మేడిశెట్టి శివరాం, ముక్కా రాంబాబు, కంటే నాగ కేశవరావు, తనకాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర

నూతన కార్యవర్గాల నియామకం



రాజమహేంద్రవరం రూరల్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ అసెంబ్లీలోని బీజేపీ 1వ మండల కమిటీ ప్రమాణ స్వీకారం, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల నూతన కార్యవర్గ నియామకాలు శుక్రవారం జరిగాయి. రాజమహేంద్రవరం 1వ మండలాధ్యక్షురాలు తుమ్మగుంట రమణమ్మ ఆధ్వర్యంలో నారాయణపురంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా తూతిక బాలసుబ్రహ్మణ్యం, తాళం భాస్కర్, కాలెపు సత్య మురళీధర్, వేల్పూరి సాంబయ్య, మావూరి సాంబశివరావు, అర్జాల కుమార్‌బాబు, ప్రధాన కార్యదర్శులుగా తణుకు రామారావు, మావూరి సత్యనారాయణ తోపాటు కార్యదర్శులు, ఓబీసీ మోర్చా, మహిళా మోర్చా, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాధ్యతలు తీసుకున్న వారికి దిశా నిర్దేశం చేశారు. పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ కమిటీ..

ధవళేశ్వరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాజమహేంద్రవరం రూరల్ 3వ మండల కమిటీ ఎంపిక ప్రక్రియ మండలాధ్యక్షుడు షేక్ షాజిత్ ఆధ్వర్యంలో స్థానిక ఫంక్షన్ హాల్లో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా వర్ధినీడి సూర్యనాగేశ్వరరావు, ఆకుల శ్రీనివాస్, హరిదాసు శ్రీలక్ష్మి, ఎ.నాగరాజు, గుత్తుల జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా వి.కుబేరరావు, ఆర్.గణపతి, కార్యదర్శులుగా తలాటం సూర్యప్రకాశరావు, జీవీ రాజు, కె.జగన్నాథరావు, కోశాధికారిగా జి.వెంకటలక్ష్మి, సభ్యులుగా ఒంటెద్దు రత్నకుమారి, నవనీత్‌కుమారి, వేమూరి శ్రీనివాస్ తదితరులు నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, యానాపు ఏసు, గుర్రాల వెంకట్రావు, పి.లక్ష్మీసంతోషి, ఒంటెద్దు స్వామి అభినందించారు.

కడియం కార్యవర్గ ఎన్నిక

కడియం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ కడియం మండలం నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం గిరజాల కృష్ణప్రసాద్ కల్యాణ మండపంలో మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది.పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, రాష్ట్ర విస్తారక్ ఉన్ని కృష్ణ ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులుగా దూడల సత్తిబాబు, గుత్తుల నాగలక్ష్మి, కొనగళ్ళ శ్రీనివాస్, సుంకర రాజబాబు, పుల్లా నాగేశ్వరరావు, పులుపు వెంకటేశ్వరరావు, కొత్తపల్లి వేంకటేశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు వేగవంతం చేయాలి

» కమిషనర్ కేతన్ గార్గ్

» రాజమహేంద్రవరం టౌన్ ప్లానింగ్ విభాగం ఆకస్మిక తనిఖీ

» కార్యకలాపాలపై సమీక్ష



టౌన్ ప్లానింగ్ విభాగాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆక్రమణల తొలగింపు పనులు వేగవంతం చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ కార్యకలాపాలపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది నిబద్ధతతో పనిచేసి నగరపాలక సంస్థ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలన్నారు. డీపీఎంఎస్ ద్వారా వచ్చే ప్రతి భవన నిర్మాణ దరఖాస్తును పెండింగ్‌లో ఉంచకుండా నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని, బీపీఎస్ దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించడానికి అవసరమైన అన్ని పత్రాలు జతచేసి దాఖలు చేయాలన్నారు. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ)కి ఫోను చేసి దరఖాస్తుతో పాటు జత చేయు చున్న పత్రాల గురించి ఆరా తీశారు. విస్తరణ చేయాల్సిన రహదారులలో ఉన్న భవన యజమానుల నుంచి పత్రాలను వెంటనే సేకరించాలన్నారు. అలాగే కొత్తగా చేపట్టబోయే రోడ్డు విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసి సదరు రోడ్డులోని భవన యజమానులతో సంప్రదింపులు వెంటనే పూర్తి చే యాలని ఆదేశించారు. టీడీఆర్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించే ముందు స్థల యజమాని అంగీకార పత్రం తీసుకొని వారు దాఖలు చేసిన స్థలం దస్తావేజులు, ఇతర పత్రాలు సక్రమంగా సమర్పించేలా చూడాలన్నారు. నగరంలో జం క్షన్ల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయా లన్నారు. కోటిపల్లి బ స్టాండ్ వద్ద అనుమతిలేకుండా ఏర్పాటు చేసిన కంటైనరును తొలగించాలని టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ (టీపీబీవో)లను ఆదేశించారు. అనుమతిలేకుండా ఏర్పా టు చేసిన బ్యానర్లను తొలగించాలని, వాటిని పెట్టిన వారికి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని ఆదేశించారు. అనంతరం ఏపీటౌన్ ప్లానింగ్ శాఖ సిబ్బంది డైరీని కమిషనర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సత్యనారాయణ రాజు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ అనితా జూలీ, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా వినియోగించుకోవాలి

ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం మంజూరు చేస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కోర్లంపేట హనుమాన్ మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులు నిర్వహించుకున్న సమావేశానికి ఆయన విచ్చేసి వారి కార్యకలాపాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.. సమావేశంలో మెప్మా సిటీ మిషన్ మేనేజరు రామలక్ష్మి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు వరలక్ష్మి, రాజ్యలక్ష్మి, హనుమాన్ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దళిత యువకుడి చేతులు నరకడం అమానుషం

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలో డిగ్రీ చదువుతున్న దళిత యువకుడు కళాశాలకు బుల్లెట్ బండి వేసుకుని వచ్చాడని అతడి రెండు చేతులు నరకడం అత్యంత దారుణమైన సంఘటన అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుడు బుల్లెట్ నడిపితే అంత వివక్షత చూపుతారా? ఉత్తరప్రదేశ్‌లో గుర్రం ఎక్కాడని ఒక పెళ్లికొడుకుని చంపేసారు. 77ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఇంకా వివక్ష చూపించడం అత్యంత దారుణమన్నారు. దీనికి కారణం ప్రభుత్వాలు, సుప్రీంకోర్టు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఇస్తున్న కొన్ని తీర్పులేనన్నారు. అట్రాసిటీ చట్టాన్ని నీరు గార్చేలా సుప్రీంకోర్టు ఉందని ఆరోపించారు. అట్రాసిటీ కేసుల్లో బెయిల్ ఇవ్వడమే దీనికి నిదర్శనమన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వ, సుప్రీంకోర్టు దళితుల సంక్షేమం కోసం కఠిన చట్టాలు తీసుకొచ్చి అమలు చేయాలని, దాడులు ఆపి దళితులను కాపాడాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర మిషన్‌లో

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 15 ఫిబ్రవరి 2025 | 5

ర్యాంకు ఎంత..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర మిషన్‌లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు మూడో ర్యాంకు వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ విషయాన్ని రాజధానిలో శుక్రవారం స్వయంగా ప్రకటించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర కోసం ప్రత్యేక కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాకు మూడో ర్యాంకు లభించడంతో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ మిషన్‌లో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్‌శాఖ 14 ఇండికేటర్స్‌తో పెట్టుకున్న లక్ష్యాలను అధికారులు సీఎం చంద్రబాబుకు అందజేశారు. అందులో పట్టణాభివృద్ధిశాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్‌కు 15 పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్‌కు 35 పాయింట్లు, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్‌కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు ఇచ్చారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్లకు 10, కమ్యూనిటీ సోక్‌పిట్స్‌కు 10 పాయింట్లు, 100 శాతం డోర్‌టు డోర్ చెత్త సేకరణకు 10, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజీకి 20 పాట్లు వంతున మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లా ప్రోగ్రెస్‌పై ర్యాంకులు ఇచ్చారు. అందులో 125 పాయింట్లతో జిల్లాకు 3వ ర్యాంకు లభించింది. జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి జిల్లాకు మూడో ర్యాంకు లభించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని 299 గ్రామాల్లో ప్రతీరోజూ పారిశుధ్యం, నీటి సరఫరా తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ఫోటోలు తీసి పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. జిల్లాలో 299 గ్రామాలకుగానూ 268 చోట్ల సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పనులు జరుగుతున్నాయని, కొన్ని షెడ్లకు సమస్య ఉన్నా, వాటి పరిష్కారానికి దృష్టి పెట్టామని చెప్పారు.

ర్యాంకు : 3 | పాయింట్లు 125/200

'తూర్పు'లో భేష్!

జిల్లా కలెక్టర్ ప్రశాంతి కృషికి ఫలితం

ర్యాంకు : 14 | పాయింట్లు 109/200

కాకినాడకు నిరాశ!

కాకినాడ /కాకినాడ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల ర్యాంకింగ్‌లో కాకినాడ వెనుకబడింది. పరిశుభ్రతా ప్రమాణాలు పాటించడంలో మంచిపని తీరు కనబరచలేక 14వ ర్యాంకులో నిలిచింది. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధిశాఖలు కలిపి వివిధ అంశాలపై మొత్తం 14 విభాగాల్లో రేటింగ్ ఇవ్వగా 200 పాయింట్లకుగాను 109 పాయింట్లు మాత్రమే సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా పరిధిలో గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత పెంచేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తోంది. ఇదిలా ఉండగా ఈనెల 3వ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోర్స్ రీసోర్స్ అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. ఇందులో భాగంగా మన మూలాలు- మన బలాలు తెలుసుకుని రాష్ట్రంలోని వనరులను ఏ విధంగా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీనికింద జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటక రంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, నెట్ జీరోకు పర్యావరణాన్ని తీసుకురావడం, సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగులు వేయడం వంటి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.

ర్యాంకు : 17 | పాయింట్లు 105/200

కోనసీమ వెనకడుగు

అమలాపురం(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 17వ స్థానంలో నిలిచి ర్యాంకుల సాధనలో వెనకబడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల్లో కోనసీమ జిల్లా మొత్తం 200 పాయింట్లకుగాను 105 పాయింట్లతో సరిపెట్టుకుంది. జిల్లాలకు 14 ఇండికేటర్స్‌ను పెట్టుకుని వాటిలో అంశాల సాధనలో ముందంజలో ఉన్న జిల్లాలవారీగా ఈ ర్యాంకులు ప్రకటించారు. ముఖ్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్‌శాఖలు చేపట్టిన కార్యక్రమాలపై సీఎం చంద్రబాబునాయుడు ఈ మేరకు సమీక్షించారు. ప్రతీ నెల 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతీ నెల ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనవరి నెలలో న్యూఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకోగా, ఫిబ్రవరిలో సోర్స్ రిసోర్స్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. జిల్లా వెనుకబడిపోవడం చర్చనీయాంశంగా మారింది.

ర్యాంకు : 25 | పాయింట్లు 81/200

అల్లూరి జిల్లాలో అధ్వానం!

రంపచోడవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా ప్రకటించిన ర్యాంకుల్లో చిట్టచివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నిలవడంతో జిల్లా ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. జిల్లా ప్రగతిపై సంబంధిత అధికారులు సరైన దృష్టి పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ జిల్లా మొత్తం 200 పాయింట్లకుగాను 81 పాయింట్లతో చివరి 25 స్థానం పొందింది. రాష్ట్రంలో మొదటి స్థానాన్ని 200 పాయింట్లకుగాను 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా నిలిచింది.

'ఇసుక' రోడ్లు!



ఇది తారు రోడ్డే : ధవళేశ్వరం క్యాయర్ బోర్డు వద్ద ఇలా..

- ప్రాణాలు పోతున్నా పట్టదు
- పరిమితికి మించి అధికంగా ఇసుక లోడ్లు
- వే బ్రిడ్జిలు లేవు.. అడిగేవారూ లేరు
- కేసులు రాస్తే.. నేత కన్నెర్ర
- అధికారుల కాసుల కక్కుర్తికి జనం బలి

ఈనెల 9న చినకొండేపూడికి చెందిన దంతే ప్రసాద్ (26) రాజమహేంద్రవరం రూరల్‌లోని ఓ వివాహానికి హాజరై తిరిగి వెళుతున్న సమయంలో సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద రోడ్డుపై ఇసుక వల్ల బండి జారిపోయింది. కిందపడిన ప్రసాద్ తలపై నుంచి అటుగా వెళ్తున్న లారీ ఎక్కేసింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు ఇసుకలో కలిసిపోయాయి. తర్వాత బొమ్మూరులోని రోడ్డుపై ఇసుక వల్ల ఓ సచివాలయ ఉద్యోగి బండి స్కిడ్ కావడంతో దెబ్బలు తగిలాయి.

ఏ రోడ్డులో వెళ్లినా ఇసుకే. రోడ్డు పక్కనా ఇసుకే. జనం జారి పడుతున్నా.. ప్రాణాలు పోతున్నా.. యంత్రాగం, ప్రజాప్రతినిధుల కళ్లకు మసకే. ఇసుక విచ్చలవిడి తరలింపు మానవత్వాన్ని కూడా ఇసుకలో కలిపేస్తోంది. కూటమి వచ్చిన తర్వాత అద్దంలా మెరుస్తున్న రోడ్లపై ఇసుక చిమ్ముతున్నా.. పట్టించుకునే వారు లేరు.. అడిగేవారు కానరారు. ఒకవేళ అధికారులు కేసు రాస్తే మాత్రం రాజకీయ బాసులకు కళ్లల్లో ఇసుక పడినంత మంట పుడుతోంది. జనం బాధ మాత్రం పట్టడం లేదనే విమర్శలు పెద్దఎత్తున వినవస్తున్నాయి.



అసలు పరదా లేకుండా..



కొవ్వూరులో..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

భోజనం తర్వాత భుక్తాయాసం పడితే గొంతు వరకూ తినకపోతేనేమి అని అంటుంటారు. ఇప్పుడు ఇసుక లారీల పరిస్థితి కూడా అంతకుమించి కనబడుతోంది. నిబంధనలు పట్టించుకోం.. అడిగేవాడూ లేడు అనే పరిస్థితి జనం ప్రాణాల మీదకు తెస్తోంది. గత ప్రభుత్వంలో ఇసుక కోసం జనం నానాతంటాలూ పడాల్సి వచ్చింది. ఇష్టానుసారం ధరలతో బెంబేలెత్తించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక లభ్యతను సీఎం చంద్రబాబు ఆదేశాలతో సులభతరం చేశారు. దీంతో సామాన్యుడికి ఇసుక అందుబాటులోకి వచ్చింది. అయితే ఇసుకాసురుల పాలిట మాత్రం వరంగా పరిణమించింది. అడ్డూఅదుపూ లేకుండా వేల టన్నుల ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో లారీలో ఇంకొక్క గుప్పెడు కూడా పట్టనంతగా ఇసుకను నింపుతున్నారు. ఆ లారీలు ఎక్కువ ట్రిప్పులు వేయాలనే ఆతృతలో వేగంగా వెళుతున్నాయి. లారీల్లోని ఇసుక సన్నగా జారుతూ రోడ్డుపై పడుతోంది. ద్విచక్ర వాహనదారులు ఏ మాత్రం ఇసుమంత అదుపుతప్పినా పెద్ద ప్రమాదానికి కారణమవుతోంది. అయినా సరే సంబంధిత శాఖలేమీ పట్టించుకోవడం లేదు.

జరిమానాలకు గంతలు

వాస్తవానికి 6 టైర్ల లారీలో 10 టన్నులకు మించి వేయకూడదు. కానీ 14 టన్నుల వరకూ నింపుతున్నారు. 10 టైర్ల లారీలో 18కి 22 టన్నులు, 14టైర్ల లారీకి 24కి 30 టన్నుల వరకూ, 16టైర్ల లారీలకు 25 టన్నులకు అదనంగా మరో పది టన్నుల ఇసుక లోడు వేస్తున్నారు. ఒకరకంగా డ్రైవరు క్యాబిన్‌లో తప్ప లారీ నిండా ఇసుకే ఉంటోంది. చట్ట ప్రకారం ఆయా లారీల్లో పరిమితికి మించి లోడు వేయకూడదు. అధికంగా ఉన్న లోడుకు టన్నుకు రూ.2 వేల చొప్పున, అదనంగా రూ.20వేలు.. అంటే 5 టన్నులు అధికంగా ఉంటే రూ.30 వేలు జరిమానా విధించవచ్చు. ఈ లెక్కన జరిమానాలు విధించకపోవడంతో లక్షల రూపాయల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. గోదావరి ఇసుక నాణ్యత ఎక్కువగా ఉండడంతో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ఇక్కడి నుంచి హైదరాబాద్ కూడా వెళుతోంది. దూర ప్రాంతాలకు మార్కెట్ లారీల్లో ఇసుక వెళుతోంది. వాటికీ 10 టన్నుల వరకూ అదనంగా లోడు వేస్తున్నారు.

రాజకీయ కన్నెర్ర

జిల్లాలోని కడియం, ధవళేశ్వరం (గాయత్రి), కోటిలింగాలు, కాతేరు, వెంకటనగరం, ముగ్గళ్ల, కాటవరం, కొవ్వూరు, తాళ్లపూడి, ఔరంగాబాద్, వాడపల్లి, అరికిరేవుల తదితర చోట్ల ఇసుక రేవులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని రోడ్లను చూస్తే మరీ దారుణంగా ఇసుకతో నిండిపోయి ఉంటున్నాయి. కొన్ని ప్రదేశాల్లో రోడ్డు పక్కన ఇసుక గుట్టలు కూడా పెడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్లు కోరలు చాస్తున్నాయి. పట్టణాలు, నగరంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. మరోవైపు ఇసుక రాపిడి వల్ల కొత్తగా వేస్తున్న రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. ఒకవైపు కూటమి ప్రభుత్వం రోడ్లను అద్దాల్లా తయారుచేస్తుంటే.. ఇసుక లారీలు వాటిని చిందరవందర చేస్తున్నాయి. అయితే ఒకవేళ అధికారులు చర్యలకు ఉపక్రమిస్తే ఇసుక వ్యాపారంలో ఉన్న, ఆ వ్యాపారులకు దన్నుగా ఉన్న రాజకీయ నాయకులు కన్నెర్ర చేస్తూ.. ఇసుక సులభతరం చేసినా స్థానిక అధికారుల వల్ల ఇబ్బందులు వస్తున్నాయంటూ సీఎం చంద్రబాబు దృష్టికి తప్పుగా సమాచారం తీసుకెళ్తున్నారని తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో జరిగినట్టు వినవస్తోంది. దీంతో జనాలు ఇబ్బంది పడుతున్నా.. ప్రాణాలు పోతున్నా అధికారులు మాత్రం కళ్లు మూసుకోక తప్పడం లేదు.

చాలీచాలని వస్త్రం

నిబంధనల ప్రకారం ఇసుక ర్యాంపుల్లో వేయింగ్ బ్రిడ్జిలను లైసెన్సుదారులు ఏర్పాటుచేసుకోవాలి. లారీలో ఇసుక లోడు చేసిన తర్వాత లారీని వేయింగ్ బ్రిడ్జిపైకి తీసుకెళ్లాలి. ఒకవేళ లోడు అధికంగా ఉంటే తొలగిస్తారు. అప్పుడు ర్యాంపులోంచి లారీ బయటకు రావాలి. కానీ ర్యాంపుల్లోంచి వందల లారీలు అధిక లోడుతో వెళుతున్నా వేయింగ్ బ్రిడ్జిలను మాత్రం ఏర్పాటు చేయడం లేదు. ఒకవేళ అరకొరా ఉన్నా ఒకటీఅరా లారీలను దానిపైకి ఎక్కిస్తున్నారంతే. ఒకవేళ వేయింగ్ బ్రిడ్జిలు ర్యాంపుల్లో ఉంటే మితిమీరిన లోడుతో లారీలు రోడ్లపైకి ఎలా వస్తున్నాయని జనం ప్రశ్నిస్తున్నారు. తీరా రోడ్డుపైకి వచ్చిన తర్వాత కూడా మోళీనే. ఇసుక లారీని అధికారులు ఆపినా వే-బిల్లు మాత్రమే చూసి రైట్ రైట్ అనేస్తున్నారు. ఇసుక రోడ్డుపై పడుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నా జరిమానాలు రాయలేని పరిస్థితి ఉండడంతో కనీసం లోడుపై పరదా కట్టాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. అది కూడా సరిగా అమలు కావడం లేదు. చాలా లారీలు ఆ ఆదేశాలను పట్టించుకోక పోగా.. కొన్నింటికే పరదా కప్పుతున్నా భారీకాయానికి కర్చీఫ్ చుట్టినట్టు ఉంటోంది. కనీసం ఇసుక లారీల వేగానికి అడ్డుకట్ట వేయలేక పోతుండడం శోచనీయం.



బొమ్మూరు జంక్షన్‌లో



ఎక్కువగా ప్రమాదాలు జరిగే జీరో పాయింట్ వద్ద

చాలీచాలని వస్త్రం కప్పి వెళుతున్న లారీ



లక్ష్యం 3,823 ఇళ్లు.. నిర్మించినవి 717

ఇళ్ల నిర్మాణం జాప్యంపై కలెక్టర్ ప్రశాంతి అసహనం

నిర్లక్ష్యం సహించేది లేదని హెచ్చరిక



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని నాల్గవ క్వార్టర్‌కు కేటాయించిన ఇళ్ల నిర్మాణం, కన్వర్షన్ లక్ష్యాల్లో కేవలం 19 శాతం మాత్రమే పూర్తి చేయడం పట్ల జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అసహనం వ్యక్తంచేశారు. నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుతో కలసి హౌసింగ్ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ నాల్గవ క్వార్టర్‌లో 100 రోజుల కార్యక్రమం కింద జిల్లాలో 3823 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెడితే, ఇప్పటివరకూ 717 పూర్తిచేశారన్నారు. స్టేజి కన్వర్షన్ విధానంలో ప్రజల్లో అవగాహన కల్పించడంలో సరైన విధానం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆమె అసహనం వ్యక్తంచేశారు. కొవ్వూరు, సీతానగరం, చాగల్లు మండలాలో 5 శాతం, అనపర్తి, కొవ్వూరు అర్బన్‌లో 6శాతం మాత్రమే పురోగతి ఉందన్నారు. కొవ్వూరు నియోజకవర్గం మొత్తం మీద కేవలం 7 శాతం, అనపర్తిలో 8 శాతం, నిడదవోలులో 12శాతం ఉందన్నారు. పనుల వేగం పెంచాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, స్టేజి కన్వర్షన్ విషయంలో కొద్దిపాటి అవగాహన కల్పించగలిగితే మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు సమీక్ష చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో హౌసింగ్ నిర్మాణాల కోసం వార్డు, గ్రామ సంఘాల నుంచి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ కె.భాస్కర్‌రెడ్డి, కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ బీవీ గిరి, హౌసింగ్ ఐటీపర్సన్ టి.విద్యాసాగర్ పాల్గొన్నారు.

19న ఏజీ ఆధ్వర్యంలో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించిన పెన్షన్, జీపీఎఫ్ కేసులను సమీక్షించడానికి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఏపీ అకౌంటెంట్ జనరల్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) అధ్యక్షతన రాజమహేంద్రవరంలోని ఆర్ట్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి ఈ అదాలత్ జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అధికారులు, డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులు వారి కార్యాలయాల్లో, శాఖల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పింఛను కేసులు, అనుబంధ సమస్యల వివరాలతో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ట్రెజరీ అధికారి ఎన్.సత్యనారాయణ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాలో 92 పోలింగ్ కేంద్రాలు

ఎమ్మెల్సీ పోలింగ్ విధుల పట్ల పూర్తి అవగాహన ఉండాలి

పీవోలు, ఏపీవోల శిక్షణలో డీఆర్వో సీతారామమూర్తి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ద్వైవార్షిక పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరుగుతుందని, అందుకు పూర్తి అవగాహనతో సిబ్బంది ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి సూచించారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన డీఆర్వో సీతారామమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 92 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారని, వాటిలో 102 మంది పీవోలు, 102 మంది ఏపీవోలు నియమించామన్నారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ఎమ్మెల్సీ ఎన్నికలతో పోలిస్తే భిన్నంగా ఉంటాయన్నారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఎన్నిక కాబట్టి సమయం ఎక్కువ పడుతుందన్నారు. 27న ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలైన్‌లో ఉన్నవారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్‌కు ఒకరోజు ముందుగానే 26న ఉదయం 8గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందాలతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ సామగ్రిని అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకువెళ్లరాదని, వాటికి అనుమతులు లేవన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులు తీసుకుని, వాటిని నిర్దేశించిన రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టంచేశారు. ఎట్టి పరిస్థితుల్లో బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీవోలు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలన్నారు. అనంతరం పోలింగ్ నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతుల్లో కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే భాస్కర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

జనరల్ మెడిసిన్ వైద్యులు ఏమయ్యారు?

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం జీటీజీహెచ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రధాన వైద్యులు ఎందుకు అందుబాటులో లేరు, ఇలాగైతే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు ఎలా అందుతాయి, డ్యూటీ డాక్టర్ లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్) వైద్యాధికారులను ప్రశ్నించారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పలు విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రధాన వైద్యులు లేకపోవడంతో అసహనం వ్యక్తంచేస్తూ అక్కడున్న వైద్యులను అడిగి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న వైద్యులు రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులంతా నిర్ణీత సమయం ప్రకారం ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని, రోగులకు సత్వర వైద్య సేవలు అందించాలని కోరారు.

రుణాల మంజూరులో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వమిత్ర పథకం కింద కచ్చితమైన భూరికార్డులను రూపొందించడానికి, ఆస్తి సంబంధిత వివాదాలు, చట్టపరమైన కేసులను పరిరక్షించడానికి యజమానులు తమ ఆస్తిని ఆర్థికంగా ఉపయోగించుకొనేలా చేయడం కోసమే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్వమిత్ర పథకం ప్రగతిపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 50 రెవెన్యూ గ్రామాల పరిధిలో గ్రౌండ్ ట్రూ థింగ్ పనులు జరుగుతున్నాయని, 75,388 ఎకరాలకుగాను 13,252 పూర్తి చేశారని, మిగిలిన లక్ష్యాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ వాలిడేషన్ ధ్రువపత్రాలకు సంబంధించి 33,326కిగాను 16,578 పంపిణీ చేయడం జరిగిందన్నారు. రీసర్వే మౌలిక సదుపాయాలు, పట్టాలు రూపొందించడానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీకి మద్దతు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి జిల్లా ప్రాజెక్ట్ పర్యవేక్షణకోసం ఒక బృందాన్ని నియమించామన్నారు. ఇందులో ఈవోపీఆర్డీ ఎస్వీ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎస్కే బాబ్జీ, గ్రామ కార్యదర్శి పి.రామకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె.రాజేష్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పనుల పురోగతిపై రోజువారీ ప్రగతిని పర్యవేక్షిస్తామన్నారు. ఈ పథకం ద్వారా ఆస్తి యజమానులకు చట్టపరమైన యాజమాన్య కార్డులను జారీ చేస్తుందన్నారు. సర్వేను క్షేత్రస్థాయిలో మార్గదర్శకాలననుసరించి పూర్తిచేయాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో డీజీపీవో శాంతామణి, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

కుంభమేళా, అజ్మీర్ యాత్రకు ఐదు ప్రత్యేక సర్వీసులు

● కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్



బస్సులను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ కుమార్, తదితర సిబ్బంది

కొవ్వూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు నుంచి ఐదు యాత్రా ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వెవీవీఎన్ కుమార్ తెలిపారు. శుక్రవారం డిపో నుంచి కుంభమేళాకు 3, అజ్మీర్‌కు 1, భద్రాచలంకు 1 బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు నుంచి ముస్లిం సోదరుల కోసం రాష్ట్రంలోనే మొదటిసారిగా అజ్మీర్, ఆగ్రా, నాగపూర్ సందర్శనార్థం బస్సు వేశామన్నారు. ఈ బస్సు ఆరురోజుల యాత్ర అనంతరం కొవ్వూరు చేరుకుంటుందన్నారు. మహా కుంభమేళాకు సంబంధించి 7 రోజుల యాత్ర ఉంటుందన్నారు. దీనిలో భాగంగా ప్రయాగ్ రాజ్, కాశీకు స్టార్ లైనర్ స్లీపర్, సూపర్ లగ్జరీ బస్సులు వేశామన్నారు. త్రయ వైకుంఠ దర్శినికి 1 బస్సు బయలుదేరిందన్నారు. కొవ్వూరు నుంచి భద్రాచలం, పర్ణశాల, మల్లూరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను దర్శించుకుని శనివారం రాత్రి 9 గంటలకు తిరిగి కొవ్వూరు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రక్కిలంక, పోచవరం గ్రామాల్లో సర్వే

తాళ్లపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడల్ గ్రామాలుగా గుర్తించిన ప్రక్కిలంక, పోచవరంలో శుక్రవారం సమిత్వ సర్వే చేపట్టినట్టు ఎంపీడీవో టీటీ వెంకటరమణ తెలిపారు. దీనిలో భాగంగా సర్వే జరుగుతున్న పరిస్థితిని జిల్లా పంచాయతీ అధికారి అమ్మాజీ, డివిజనల్ పంచాయతీ అధికారి శాంతామణికి వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వీరన్న, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


పోచవరంలో సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో వెంకటరమణ, జిల్లా అధికారులు

కూటమి నేతల ఎన్నికల ప్రచారం

● పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా నిలవాలని అభ్యర్థన


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కూటమి నాయకులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతు తెలుపుతూ శుక్రవారం పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. దీనిలో భాగంగా సచివాలయాలు, ఉన్నత పాఠశాలలు, సొసైటీ ఉద్యోగులు, పలు ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులను కలిసి ఓటును అభ్యర్థించారు. జీవీ ప్రసాద్, నామన పరమేశ్వరరావు, కాకర్ల సత్యేంద్ర, కొఠారు వెంకట్రావు, కొప్పాక కోటీస్, ఇండుగుల రామకృష్ణ, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు నివాళి

● కొవ్వూరు పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ



అమరవీరులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల ప్రాణ త్యాగాలను గుర్తు చేసుకుంటూ శుక్రవారం రాత్రి పారా మిలటరీ బలగాలు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకరరావు మాట్లాడుతూ దేశ సరిహద్దులలో రక్షణతో పాటు అత్యంత సంక్లిష్ట పరిస్థితులలో అసాధారణ వాతావరణంలో ప్రచ్ఛన్న యుద్ధం చేస్తూ, ప్రతి రోజూ ఉగ్రవాదుల ఏరివేత, నక్సల్స్ ఎన్‌కౌంటర్ ఆపరేషన్ (ఆపరేషన్ ఖగార్) వంటి కార్యకలాపాల్లో పాల్గొని పదవీ విరమణ చేసి వచ్చిన వారికి, శత్రువుల చేతిలో అసువులు బాసిన వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంక్షేమం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి కంటితుడుపు వాగ్దానాల్లో ఒక్కటీ అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజేశ్వరరావు, డీవీవీ ప్రసాద్, కోన దామోదరరావు, శాంతారామ్, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలోనూ అమరులైన జవాన్లకు నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రామమోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులు అమర జవాన్ల చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, జాతీయ గీతం ఆలపించి నివాళి అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. వై.రమేష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కి 38 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియల్ వార్షిక పరీక్షలు- 2025 కు సంబంధించి శుక్రవారం జనరల్, ఒకేషనల్ విభాగాలకు నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలకు మొత్తం 3,642 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, అందులో 38 మంది గైర్హాజరైనట్టు ఇంటర్మీ డియట్ విద్యాప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు.

రీ సర్వేను వినియోగించుకోవాలి


ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి, సర్వేయర్ సత్యనారాయణ

తాళ్లపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కుకునూరు డి. పాపులేటెడ్ గ్రామమైన వీరభద్రపురంలో జరుగుతున్న రీ సర్వేను రైతులు, భూ యజమానులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో వీరభద్రపురం రెవెన్యూ రికార్డుల ప్రకారం 467 ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నాయని 400 ఎకరాలలో రైతులు రీసర్వేలో పాల్గొన్నారని పేర్కొన్నారు. మిగతా రైతులు, వేరువేరు గ్రామాలలో ఉంటున్న రైతులు, భూ యజమానులు ఈ కార్యక్రమానికి విచ్చేసి తమ భూములు పరిశీలిం చుకోవాలని ఆమె చెప్పారు. మండల సర్వేయర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలంగిలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పాలంగి రామలింగేశ్వరస్వామివారి ఆలయం వద్ద ఈనెల 15వ తేదీన జరిగే ధ్వజస్తంభం ప్రతిష్ఠ సందర్భంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, వాస్తుహోమం, వాస్తు బలిపూజలు ఆలయ అర్చకులు వి. శేషరఘుబాబు ఆధ్వర్యంలో జరిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శనివారం చాపరాల కృష్ణ, రమణకుమారి దంపతులచే పునఃధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొననున్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం : నాగేంద్ర


చాగల్లు మండల బీజేపీ నూతన కార్యవర్గంతో నాగేంద్ర

చాగల్లు, ఫిబ్రవరి 14, (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.నాగేంద్ర అన్నారు. శుక్రవారం నెలటూరులో బీజేపీ మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఢిల్లీ సహా పలు రాష్ట్రాలలో బీజేపీ గెలుపు బావుటా ఎగురవేసిందన్నారు. ఇందులో పార్టీ అధ్యక్షుడిగా తాళ్ళూరి వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొండపని శ్రీనివాస్, కట్టా సత్యనారాయణ, ముళ్ళపూడి లక్ష్మి, జుట్ట వెంకట గణపతి, ప్రధాన కార్యదర్శులుగా వై. కాంచన, సౌందర్య, బచ్చు నాగరాజు, కార్యదర్శులుగా ఏలూరు సుజాత, మునికోటి సత్యనారాయణ, బి. వీర నాగలక్ష్మి, తమ్మినేని కుమారి, ఎం. శేఖర్, కోశాధికారిగా తాళ్ళూరి గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. ముత్యాలరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గ్రంధి రాంబాబు, కరుటూరి జగన్, మద్దిపాటి సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

● కూటమి అభ్యర్థిని గెలిపించాలి

ప్రస్తుతం జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి బలపరచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని నాగేంద్ర కోరారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి పక్షాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ పత్రాలు అందజేత


చిన్నాయిగూడెంలో పత్రాన్ని అందజేస్తున్న సుబ్బారావు, టీడీపీ నాయకులు

దేవరపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చిన్నాయిగూడెంకి చెందిన ఆలూరి సుబ్బారావు కుమార్తెకు ఐదునెలల పాప ఉంది. ఈ చిన్నారి గుండె ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్షా 70 వేలు మంజూరయ్యాయని గ్రామ టీడీపీ అధ్యక్షుడు పిన్నమనేని సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మంజూరైన ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును కలిసి పాపకు గుండె ఆపరేషన్ చేయించాలని కోరడంతో వెంటనే ఆయన నగదు మంజూరు చేయించారని , దీనికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గన్నమని గోపి, ఆచంట నాగేశ్వరరావు, పరిమి గంగాధర్, చిలకా రాజేష్, గడా రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'సంఘమిత్ర' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈవో సత్యనారాయణ

నల్లజర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దూబచర్లకు చెందిన సంఘమిత్ర విద్యార్థులు అబాకస్, వేదిక్ మాథ్స్‌లో ప్రతిభ సాధించారు. ఇందుకు శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో విద్యార్థులకు ఎంఈవో సత్యనారాయణ మెమోంటోలు అందించారు. ఇటీవల విజయవాడలో విశ్వం ఎడ్యుటెక్ వారి ఆధ్వర్యంలో జరిగిన వేదిక్ మాథ్స్ పోటీల్లో సంఘమిత్ర స్కూల్ విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. వారిని ఎంఈవోతోపాటు స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు అభినందించారు.

డెల్టాకు 8,850 క్యూసెక్కుల నీటి విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు 8,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 2,650 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1800 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8,465 క్యూసెక్కులుగా ఉండగా, నీటిమట్టం 9.45 అడుగులుగా నమోదయ్యింది.

అంగన్వాడీలకు రెండోరోజూ శిక్షణ తరగతులు


కొవ్వూరులో శిక్షణ ఇస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు


యర్నగూడెంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి

కొవ్వూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీపై అంగన్వాడీలకు శిక్షణ ఇస్తున్నారు. ఐసీడీఎస్ సీడీపీవో డి. మమ్మీ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వూరు పట్టణ కార్యకర్తలకు గర్ల్స్ హైస్కూల్లో, మండల కార్యకర్తలకు సంస్కృత పాఠశాలలో పోషణ్ బీ, పడాయి బీ మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె. వెంకట పద్మిణి, జి. ఆదిలక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: బాల్యంలోనే పిల్లల పోషణ, మానసిక వికాసం పెంపొందే విధంగా తగుచర్యలు తీసుకోవాలని ఏసీడీపీవో పద్మావతి అన్నారు. పోషణ -బీ పడాయి-బీపై అంగన్‌వాడీలకు నల్లజర్ల, పోతవరం హైస్కూల్‌లో రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు మానసిక వికాసం కలిగించే విధంగా పౌష్టికాహారంతో పాటు చదువు నేర్పించడం ఈ శిక్షణ తరగతుల ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకట లక్ష్మి, హారతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

దేవరపల్లి: యర్నగూడెం జడ్పీ హైస్కూల్‌లో మొత్తం 79 అంగన్వాడీ సెంటర్లలోని అంగన్వాడీ టీచర్లు, వర్కర్లకు శుక్రవారం (రెండో రోజు) శిక్షణ తరగతులు నిర్వహించారు. దీనికి సూపర్‌వైజర్ ఎం.విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా మంచి పౌష్టికాహారం అందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు ఎం.శశికళ, విజయశాంతి, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చిన్నారులలో మానసిక వికాసం కలిగేలా అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా విద్యా బుద్ధులు నేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీ. పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో చాగల్లు, మార్కొండపాడు సెక్టార్ల పరిధిలోని సిబ్బందికి పోషణ్ బీ, పడాయి బీ శిక్షణ ఇచ్చారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి. శిరీషా, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం/పెరవలి : వేలివెన్నులో అంగన్‌వాడీ వర్కర్లకు శుక్రవారం పోషణ్‌బీ, పడాయి బీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో నవచేతన లోపం ఉన్న పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. జీరో నుంచి ఆరు సంవత్సరాలు లోపు చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, విద్యావిధానంపై దృష్టిసారించడం, వారి మేధస్సును పెంపొందించడం వంటి పలు విషయాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు వారి పిల్లలను క్రమం తప్పకుండా కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం. బాలసరస్వతి, భాగ్యలక్ష్మి, మాణిక్యాలరావు, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. పెరవలిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎం. లక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. 65 మంది అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇస్తున్నామని, శనివారం వరకు జరుగుతాయని ఆమె వివరించారు.


నల్లజర్లలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న ఏసీడీపీవో పద్మావతి


చాగల్లులో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి


పెరవలిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం / పెరవలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూరగుపల్లి శేషారావు, ఎన్నికల పరిశీలకుడు బూరగడ్డ వేదవ్యాస్ పేర్కొన్నారు. శుక్రవారం పెరవలిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లటంలో చేస్తున్న కృషికి ప్రజా సహకారం అవసరమన్నారు. కూటమి బలపర్చిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కూటమి నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అతికాల వెంకటరామకృష్ణమ్మ(శ్రీను), జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పి.రవి, కూటమి నాయకులు బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన 16 టన్నుల పీడీఎస్ బియ్యానికి వేలం


దేవరపల్లిలో వేలం వేస్తున్న డీఎస్‌వో నాగాంజనేయులు

దేవరపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో సీజ్ చేసిన 16 టన్నుల పీడీఎస్ బియ్యానికి శుక్రవారం వేలం వేయగా, సుమారు రూ. నాలుగు లక్షల ఆదాయం వచ్చినట్టు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఎం.నాగాంజనేయులు తెలిపారు. దేవరపల్లిలో వెంకటేశ్వర రైస్‌మిల్లులో 2021లో సీజ్ చేసిన బియ్యానికి వేలం నిర్వహించామన్నారు. డీఎస్‌వో ఎం.నాగాంజనేయులు మాట్లాడుతూ వేలంలో 25 మంది వ్యాపారస్థులు పాల్గొన్నారని తెలిపారు. నల్లజర్ల గ్రామానికి చెందిన వినాయక ట్రేడర్స్ యాజమాని ఈ వేలం పాట ద్వారా బియ్యాన్ని దక్కించుకున్నారు. వేలంలో ఏజీపీవో ఎం.రంగప్రసాద్, సూపరింటెండెంట్ సురేష్ బాబు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

తాడిపర్రులో డ్రోన్‌తో పిచికారీ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రులో ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్రోన్ సాయంతో కషాయ వరి చేల్లో పిచికారీ చేశారు. సుమారు 38 ఎకరాల్లో ఈ డ్రోన్ సహాయంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వేపగింజల కాషాయం, పాల ఇంగువ, మీనామృతం, నిమ్మరసం కలిపి స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి అక్కిన కాశీవిశ్వనాథం, ఐసీఆర్‌పీ పెదపాటి ఉమామహేశ్వరి, మాదే ఇందిర, కడలి మౌనిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం వేలం పాట వాయిదా


గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలం నిర్వహిస్తున్న డీఎస్‌వో నాగాంజనేయులు

గోపాలపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఆయా కేసుల్లో సీజ్ చేసిన పీడీఎస్ బియ్యానికి శుక్రవారం స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లై అధికారులు వేలంపాట నిర్వహించారు. అయితే అధికారులు నిర్ణయించిన ధరకు పాటదారులెవరూ కొనేందుకు ముందుకు రాకపోవడంతో వాయిదా పడింది. దీనిపై డీఎస్‌వో ఎం.నాగాంజనేయులు మాట్లాడుతూ సీజ్ చేసిన 47.274 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యానికి బహిరంగ వేలం పాట నిర్వహించటం జరిగిందన్నారు. ఈ పాటలో ఆయాప్రాంతాల నుంచి వచ్చిన 23 మంది వ్యాపారులు పాల్గొన్నట్టు చెప్పారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ రూ. 32 ధరగా నిర్ణయించినట్టు వివరించారు. వచ్చిన వ్యాపారులు 26.50 పైసలకు మాత్రమే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడంతో పాటను నిలిపివేశామన్నారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ చినరాముడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏపీజీఓ రంగప్రసాద్, నిడదవోలు, గోపాలపురం సీఎస్‌డీటీలు అనిల్‌కుమార్, దివాకర్, పాటదారులు పాల్గొన్నారు.